
# క్రైమ్ మిర్రర్ ®

Voice of Anti Corruption

హైదరాబాద్
24-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 122

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# ఇన్చార్జ్ మంత్రి అయితే?!

ఏంటి గొప్ప అంటున్న కాంగ్రెస్ నేతలు

జిల్లాల్లో లెక్కలేకుండా వ్యవహరిస్తున్న వైనం

శృతిమిస్తున్న విభేదాల పర్వం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** నల్లగొండలో తుంగతుర్తి పంచాయితీ నడుస్తోంది. మంత్రి ఆడ్లూరికి తెలియకుండానే గాంధీభవన్కు వివాదం నడిచింది. వరంగల్ లో పొంగులేటికి పరువు దక్కడం లేదు.

3లో

తెలంగాణలో అధికార కాంగ్రెస్ పరిస్థితి రోజురోజుకు దిగజారుతోంది. పార్టీలో క్రమశిక్షణ కట్టు దాటుతోంది. నేతలు ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా సీనియర్ నేతల మధ్య విభేదాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. దాదాపు అన్ని జిల్లాల్లో పరిస్థితి అలానే ఉంది. జిల్లా ఇన్చార్జ్ మంత్రులంటే లెక్కలేనితనంగా వ్యవహరిస్తున్నారు. దాదాపు అన్ని చోట్ల పరిస్థితి ఇలానే ఉంది. వారి ప్రమేయం లేకుండానే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు.

# కేటీఆర్ వ్యూహాత్మక తప్పిదం!



## సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలను తిప్పి కొట్టలేక పోతున్న వైనం

అప్పట్లో డ్రగ్ టెస్ట్ విషయంలోనూ..

ఇప్పుడు గ్లోబరీనా అంశం పైన..

అన్నింటికీ లీగల్ నోటీసుల అస్త్రం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో పాలిటిక్స్ హాట్ హాట్ గానే ఉన్నాయి. దానికి కారణం సీఎం రేవంత్ రెడ్డి, గులాబీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.


- మిగతా 2వ పేజీలో

# ఏపీలో ఎమ్మెల్సీ నగారా!

గవర్నర్ కోటా కింద రెండు పదవులు ఖాళీ

టిడిపిలో విపరీతమైన పోటీ

వర్ల రామయ్య, రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డికి ఖరారు




**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో :** ఏపీలో ఎమ్మెల్సీ ఎన్నికల సందడి ప్రారంభం అయింది.

## అల్లర్ల నిందితుల పాస్‌పోర్ట్‌ల రద్దు

# యోచనలో ఢిల్లీ పోలీసులు

నీట్ అక్రమాలపై ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థి నిరసనలు

ఆందోళనల్లో అల్లర్లకు పాల్పడిన నిందితుల పాస్‌పోర్ట్‌ల రద్దుకు పోలీసుల యోచన

నిందితులు దేశం విడిచి పారిపోకుండా నిరోధించేందుకు ఈ చర్య

'చలో సంసద్' ర్యాలీలో పోలీసులతో ఘర్షణలు జరగడంతో పలువురిపై కేసులు

2లో



# కాంగ్రెస్ ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కోదండరాం!

తెలంగాణ జన సమితి నేతలకు పదవులు ఇచ్చుకునేందుకు ప్రొఫెసర్ ప్రయత్నం

అధికార పార్టీ పై ఒత్తిడి పెంచుతున్న వైనం

## 'నీట్' పై మాట్లాడలేని

# తెలుగు పార్టీలు!



ఎన్డీఏ తీరుపై విమర్శించలేని స్థితిలో కేసీఆర్, జగన్

కేసుల భయంతో మౌనం

రాజకీయంగా భారీ మూల్యం

3లో

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** దేశవ్యాప్తంగా నీట్ లీకేజీ వ్యవహారం హాట్ టాపిక్ అవుతోంది. దాదాపు అన్ని రాజకీయ పార్టీలు దీనిపై స్పందిస్తున్నాయి. కానీ తెలుగు రాష్ట్రాల్లో రెండు ప్రతిపక్ష పార్టీలు మాత్రం నోరు తెరవడం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు భారత రాష్ట్ర సమితి కనీసం స్పందించడం లేదు.



## బండ్ల గణేష్‌కు


# షాక్!

యూనియన్ బ్యాంక్ రుణ వేలానికి సంబంధించి సుప్రీంకోర్టు ఆదేశం


తెలంగాణ హైకోర్టు ఆదేశాలు యధాతథం

తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు : బండ్ల గణేష్ విజ్ఞప్తి

**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** తెలుగు సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ కు షాక్ తగిలింది. ఆయన ఆస్తి వేలం వివాదానికి సంబంధించి సుప్రీంకోర్టులో ప్రతికూల తీర్పు వచ్చింది. జూబ్లీహిల్స్ లోని తన కుటుంబానికి చెందిన ఆస్తిని యూనియన్ బ్యాంక్ వేలం వేయడాన్ని సవాల్ చేస్తూ.. ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను అత్యున్నత న్యాయస్థానం తిరస్కరించింది.



2లో



2లో

# మంత్రులపై చంద్రబాబు ఆగ్రహం!

పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశం

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని తిప్పి కొట్టాలని సూచన

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** మంత్రులపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు సీఎం చంద్రబాబు. శాఖ పరంగా పనితీరు మెరుగుపరచుకోవడం తోపాటు రాజకీయంగా యాక్టివ్ కావడం లేదన్న ఆవేదనతో ఉన్నారు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వస్తున్న విమర్శలను తిప్పి కొట్టడం లేదన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మంత్రులపై. గురువారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది.. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలను తిప్పి కొట్టడంలో మంత్రులు చురుగ్గా వ్యవహరించాలని ఆదేశించారు.

## నీట్ వివాదంపై సచిన్ టెండూల్కర్ స్పందన

ఓటమి ఫర్వాలేదు కానీ, మోసం చేయకూడదన్న తండ్రి మాటలను గుర్తు చేసుకున్న సచిన్

ప్రతిభ కంటే షార్ట్‌కట్‌లను ఆశ్రయించే సంస్కృతిని మార్చాలని పిలుపు

కష్టానికి తగిన ప్రతిఫలం దక్కనప్పుడు విద్యార్థులు నిరాశ చెందడం సహజమేనని వ్యాఖ్య

3లో

# విద్యార్థి సంఘాల బంద్..

ఓయూ పరిధిలో రేపటి పరీక్షలు వాయిదా

జూలై 24న జరగాల్సిన ఓయూ పరిధిలోని అన్ని పరీక్షలు వాయిదా

విద్యార్థి సంఘాల బంద్ పిలుపుతో వర్సిటీ నిర్ణయం

నీట్ లీకేజ్, విద్యార్థులపై లాఠీచార్జ్‌కు నిరసనగా బంద్

త్వరలోనే కొత్త తేదీలను ప్రకటించనున్న అధికారులు





# కేటీఆర్ వ్యూహాత్మక తప్పిదం!

(మొదటి పేజీ తరువాయి)

గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే వీరిద్దరి మధ్య మాటల తూటాలు పేలాయి. రేవంత్ సీఎం అయ్యాక కేటీఆర్ మరింత దూకుడు పెంచారు. అటు రేవంత్ సైతం ఎక్కడ వెనక్కి తగ్గడం లేదు. ఆది నుంచి రేవంత్ కెసిఆర్ తో పాటు కేటీఆర్ ను టార్గెట్ చేసుకుంటూ రాజకీయ వ్యూహాలు అమలు చేశారు. కేటీఆర్ సైతం అదే స్థాయిలో కౌంటర్లు ఇస్తూ వచ్చారు. అయితే రేవంత్ రెడ్డి చేసే సవాళ్లకు, ఆరోపణలకు కేటీఆర్ సమాధానమిచ్చే తీరుపై ఇప్పుడు పొలిటికల్ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

**నోరు మూయించే ప్రయత్నం..**

అయితే కేటీఆర్ పై సీఎం రేవంత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడిన క్రమంలో తరచూ లీగల్ నోటీసుల ప్రస్తావన తీసుకొస్తున్నారు కేటీఆర్. తనపై రేవంత్ చేసే ఆరోపణలను సవాళ్ల కింద తీసుకోవడం కంటే.. ఆయన నోరు ముయించేందుకు ఎక్కువ ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ బలమైన ఆరోపణ చేశారు. డ్రగ్స్ టెస్ట్ సవాల్ విసిరారు. ఇద్దరం రక్త నమూనాలు ఇద్దామని.. డ్రగ్స్ టెస్ట్ చేయించుకుందామని సవాల్ చేశారు రేవంత్. కానీ కేటీఆర్ అందుకు సిద్ధపడకుండా కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. అప్పట్లో అది సంచలనం. అటు తరువాత జన్వాడ ఫామ్ హౌస్ వ్యవహారంలోనూ, భారత రాష్ట్ర సమితి హయాంలో ఇంటర్ విద్యార్థుల ప్రాణాలను బలిగొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొన్న గ్లోబరీనా విషయంలోనూ సీఎం రేవంత్ తాజాగా సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో రేవంత్ రెడ్డి మళ్ళీ గ్లోబరీనా అంశాన్ని తెరపైకి తెచ్చారు. అయితే దానిపై ట్విట్టర్ వేదికగా స్పందించారు కేటీఆర్. తనకు, తన కుటుంబానికి గ్లోబరీనాతో సంబంధం లేదని.. అలా ఆరోపణలు చేస్తే లీగల్ నోటీసులు పంపుతానని హెచ్చరించారు.

**ప్రజల్లోకి ఆరోపణలు..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ఆరోపణలు చేసినా వెంటనే లీగల్ నోటీసులు ఇవ్వడమే సమాధానం గా భావిస్తున్నారు కేటీఆర్. అయితే కేటీఆర్ ఇలా వ్యవహరిస్తుండడంతో రేవంత్ చేస్తున్న ఆరోపణలు ప్రజల్లోకి బలంగా వెళ్తున్నాయి. ప్రతిసారి లీగల్ నోటీసుల ఆయుధాన్ని ముందు ఉంచకుండా.. కేటీఆర్ వాస్తవాలతో ముందుకు వస్తే ఈ వివాదాలకు శాశ్వతంగా తెరపడే అవకాశం ఉంది. డ్రగ్స్ టెస్ట్ విషయంలో రేవంత్ సవాల్ స్వీకరించి రక్త నమూనాలు ఇచ్చి ఉంటే ఆరోపణలు ఎప్పుడో పటాపంచలు అయ్యేవి. గ్లోబరీనా వ్యవహారంలోనూ బెదిరింపులకు దిగకుండా.. స్పష్టమైన ఆధారాలతో ప్రెస్ మీట్ పెడితే.. ఆ ఆరోపణల్లో నిజం లేదని తేలిపోయేది. కానీ ఎందుకో కేటీఆర్ తన రాజకీయ వ్యూహంలో తప్పిదాలకు పాల్పడుతున్నారని అర్థం అవుతోంది.

# ఏపీలో ఎమ్మెల్సీ నగారా!

(మొదటి పేజీ తరువాయి)

గవర్నర్ కోటా కింద రెండు ఎమ్మెల్సీ పదవులు ఈనెల 28 తో ఖాళీ అవుతున్నాయి. దీంతో ఎమ్మెల్సీ పదవుల రేసులో పలువురు నేతల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. టిడిపి సీనియర్ నేతలతో పాటు జూనియర్ నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. నేతలు ఎవరికి వారుగా ప్రయత్నాలు ఉన్నారు. రోజురోజుకు ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. అయితే ఈసారి ఆ రెండు ఎమ్మెల్సీ పదవులు తెలుగుదేశం పార్టీ తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చంద్రబాబు బిజెపితో పాటు జనసేన నాయకత్వానికి కూడా సమాచారం అందించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**ఆ ఇద్దరూ పదవీ విరమణ..**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో గవర్నర్ కోటా కింద ఎంపికైన శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జాకియా ఖానం, పండుల రవీంద్రబాబు పదవీకాలం ఈనెల 28 తో పూర్తి కానుంది. ఈ రెండు పదవుల భర్తీపై టిడిపి హాయ్ కమాండ్ ఫుల్ ఫోకస్ పెట్టింది. కొద్దిరోజుల వ్యవధి ఉండడంతో చంద్రబాబు కసరత్తు మొదలుపెట్టినట్లు సమాచారం. ఎమ్మెల్సీ పదవుల రేసులో టిడిపి నుంచి పలువురి పేర్లు తెరపైకి వస్తున్నాయి. గవర్నర్ నామినేటెడ్ కోటాలో ఖాళీ అవుతున్న ఈ రెండు ఎమ్మెల్సీ పదవుల్లో ఒకటి సీనియర్కు, మరో పదవి జూనియర్ కు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈసారి రాయలసీమకు పదవి కేటాయిస్తారు అన్న ప్రచారం కూడా నడుస్తోంది. అయితే చాలామంది పేర్లు తెరపైకి వస్తున్నాయి. విపరీతమైన పోటీ ఉన్నట్లు అర్థం అవుతోంది.

**రాయలసీమకు చాన్స్..**

ఎమ్మెల్సీ పదవుల్లో ఒక్కదాన్ని రెడ్డి సామాజిక వర్గానికి కేటాయిస్తారని తెలుస్తోంది. ప్రధానంగా కడప జిల్లాకు చెందిన రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి పేరు వినిపిస్తోంది. రాజ్యసభ ఎన్నికల సమయంలో ఆయన పదవి ఆశించారు. దక్కకపోయేసరికి తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఒకవేళ ఆయన ఎమ్మెల్సీ పదవిని కోరుకుంటే తప్పకుండా ఆయనకే కేటాయిస్తారు. మరో పదవిని మాత్రం సీనియర్ నేత వర్ల రామయ్యకు ఇస్తారని తెలుస్తోంది. అయితే ఇంకా చాలామంది ఆశావహులు తమ ప్రయత్నాల్లో ఉన్నారు. అధినేత తో పాటు నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఆశావహులు ఎక్కువ..**

ప్రధానంగా ఆశావహుల్లో వంగవీటి రాధాకృష్ణ, దేవినేని ఉమామహేశ్వరరావు, పిఠాపురం వర్మ, బుద్ధ వెంకన్న, మహాసేన రాజేష్, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ ఉన్నారు. అయితే వర్ల రామయ్యకు రాజ్యసభ పదవులు ఇస్తామని చాలాసార్లు ఆశలు పెట్టారు. ఒకసారి ఆయన ఓడిపోతానని తెలిసి కూడా రాజ్యసభకు పోటీ చేశారు. అందుకే ఈసారి ఆయనకు చాన్స్ ఉంటుందని తెలుస్తోంది. రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డి ఒకే చెబితే ఆయనకు పదవి ఖాయమని కూడా ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఆయన వద్దనుకుంటే మాత్రం జూనియర్ నేతల్లో ఒకరికి దక్కడం ఖాయం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# కాంగ్రెస్ ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న కోదండరాం!

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రొఫెసర్ కోదండరాం అసంతృప్తితో ఉన్నారా? తన పార్టీకి అన్యాయం జరుగుతోందని భావిస్తున్నారా? రేవంత్ సర్కార్ పై ఒత్తిడి పెంచే ప్రయత్నంలో ఉన్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మిత్రపక్షంగా పనిచేసింది కోదండరాం తెలంగాణ జన సమితి.. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతోంది. కానీ నామినేటెడ్ పదవులతో పాటు ఇతర ప్రయోజనాలు విషయంలో తెలంగాణ జన సమితికి ఆశించిన స్థాయిలో ప్రాధాన్యత దక్కడం లేదు. దీంతో ప్రొఫెసర్ కోదండరాం పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, కాంగ్రెస్ పార్టీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కు నామినేటెడ్ పదవుల విషయంలో తమ వారికి న్యాయం చేయాలని కోరినట్లు తెలుస్తోంది. మరోవైపు త్వరలో ఆయన సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అవుతారని సమాచారం.

**మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ కు మద్దతు..**

మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపింది తెలంగాణ జన సమితి. అయితే పదవుల విషయంలో ఆ పార్టీకి న్యాయం జరగలేదు. ఒక్క కోదండరాంకు మాత్రమే ఎమ్మెల్సీ పదవి వచ్చింది. అయితే ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ పాలన మూడేళ్లు పూర్తవుతున్న తరుణంలో.. తమ పార్టీ నేతలకు పదవులు ఇవ్వాలని కోదండరాం బలంగా కోరుతున్నారు. మిత్రపక్షం పై ఒత్తిడి పెంచుతూనే ఉన్నారు.. మిత్రపక్షంగా ఉండి.. కాంగ్రెస్ గెలుపులో క్రియాశీలకంగా పని చేసిన పార్టీని పక్కన పెట్టేసారని.. ఇచ్చిన హామీలు మరిచారనే అసంతృప్తి కోదండరాంలో ఉంది. అయితే ఇప్పటికే తమ సొంత పార్టీ నేతలకు పదవులు ఇచ్చే విషయంలోనే కాంగ్రెస్ హై కమాండ్ తర్జనభజన పడుతూ వస్తోంది. ఇప్పుడు కొత్తగా కోదండరాం పార్టీ నుంచి ఒత్తిడి పెరగడంతో.. కాంగ్రెస్ హై కమాండ్ పునరాలోచనలో పడింది.

**నేతల పేర్లతో జాబితా..**

తెలంగాణ జన సమితి బలోపేతం పై దృష్టిపెట్టారు ప్రొఫెసర్ కోదండరాం. అందుకే తనను నమ్ముకొని పార్టీలో చేరిన వారికి పదవులు ఇవ్వాలని ఆయన భావిస్తున్నారు. అందులో భాగంగా నామినేటెడ్ పదవుల కోసం తన పార్టీలోని ఆశావహుల జాబితాను సీఎం రేవంత్ కు ఇప్పటికే కోదండరాం అందజేసినట్లు తెలుస్తోంది. వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, వైస్ చైర్మన్ ల కోసం పట్టుబడుతున్నట్లు సమాచారం. ప్రధానంగా తన పార్టీకి చెందిన ధర్మార్జున్, అంబటి శ్రీనివాస్, సలీం పాషా, బైరి రమేష్, ఆసప్ప, నిజ్జన రమేష్, మానంపల్లి అరుణ్ కుమార్ పేర్లతో కూడిన జాబితాను కోదండరాం కాంగ్రెస్ పార్టీకి అందజేసినటు తెలుస్తోంది. ఇప్పుడు పదవులు ఇవ్వకపోతే వచ్చే ఎన్నికల్లో పనిచేయలేమని తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది. ఒకవైపు కాంగ్రెస్ నేతలకు పదవులు లేకుంటే.. ఇప్పుడు కొత్తగా తెలంగాణ జన సమితి నేతలకు ఎలా ఇస్తామంటూ కాంగ్రెస్ పార్టీ పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## అల్లర్ల నిందితుల పాస్‌పోర్ట్‌ల రద్దు యోచనలో ఢిల్లీ పోలీసులు

నీట్-యూజీ 2026 పరీక్షల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో విద్యార్థి సంఘాలు చేపట్టిన నిరసనల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో, దాడులకు పాల్పడినట్లు అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితుల పాస్‌పోర్ట్‌లను రద్దు చేసే అంశాన్ని ఢిల్లీ పోలీసులు తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.'చలో సంసద్' పిలుపులో భాగంగా నిరసనకారులు పార్లమెంటు వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో పోలీసులతో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ కేసుల్లో అరెస్టయిన కీలక నిందితులు విచారణ దశలో దేశం విడిచి పరారయ్యే అవకాశం ఉందని భావిస్తున్న అధికారులు, ముందస్తు జాగ్రత్త చర్యగా వారి పాస్‌పోర్ట్‌లను రద్దు చేయించాలని యోచిస్తున్నారు. సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం కేంద్ర దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రక్రియను చేపట్టాలని పోలీసులు భావిస్తున్నారు.గత కొన్ని వారాలుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, పరీక్షల నిర్వహణ విధానంలో సమూల సంస్కరణలు తీసుకురావాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసనలు అధిక భాగం శాంతియుతంగానే సాగినప్పటికీ, కొన్ని చోట్ల రాళ్ల దాడి, పోలీసు వలయాలను ఛేదించే ప్రయత్నాలు జరగడంతో ఇరుపక్షాలకు చెందిన పలువురు గాయపడ్డారు. ఈ ఘటనలకు సంబంధించి పోలీసులు ఇప్పటికే పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. అయితే, పాస్‌పోర్ట్‌ల రద్దుపై ఇంకా ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదని, ప్రస్తుతం ఈ అంశం సమీక్ష దశలోనే ఉందని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.



# 'నీట్' పై మాట్లాడలేని తెలుగు పార్టీలు!

విద్యార్థులు, యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఇంతటి సున్నితమైన అంశంపై కూడా ఈ రెండు పార్టీలు గట్టిగా మాట్లాడడం లేదు. దానికి కారణం భయం. నీట్ అంశం పై ప్రశ్నించిన మరుక్షణం.. తమపై ఎదురు దాడి ఖాయమన్న ఆందోళన ఆ రెండు పార్టీల్లో ఉంది.

**అత్యంత క్లిష్ట పరిస్థితి..**

ప్రస్తుతం బిజెపి నేతృత్వంలో ఎన్డీఏ అధికారంలో ఉంది. ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలంగాణలో భారత రాష్ట్ర సమితికి బిజెపి అంటే భయం ఉంది. బిజెపి పెద్దలకు కోపం వస్తే తమ రాజకీయ ఉనికికే ప్రమాదం అని కెసిఆర్ తో పాటు జగన్మోహన్ రెడ్డికి తెలుసు. తెలంగాణలో ఓటమి తర్వాత గులాబీ పార్టీ, ఏపీలో ఓడిపోయిన తరువాత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన రక్షణాత్మక వైఖరిలోకి వెళ్లిపోయాయి. గతంలో చేసిన పద్ధతులు, సిబిఐ, ఈ డి, ఐటీ దర్యాప్తు లేదా చట్టపరమైన కేసులు తమ మేడకు చుట్టుకుంటాయనే ఆందోళనతో కేంద్ర పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నాయి ఆ రెండు పార్టీలు. అందుకే జాతీయస్థాయిలో ఇండియా కూటమికి దూరంగా ఉన్నాయి. ఆపై ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క వ్యాఖ్య కూడా చేయలేదు.

**దగ్గర కాలేక.. వ్యతిరేకించలేక..**

తెలంగాణలో కాంగ్రెస్ రూపంలో వ్యతిరేక రాజకీయ శక్తి గులాబీ పార్టీకి ఉంది. ఏపీలో జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ ఉన్నారు. బిజెపితో స్నేహం వరకు ఓకే అయితే కానీ పొత్తు మాత్రం ఆ రెండు పార్టీలకు కుదరదు. తెలంగాణలో బిజెపితో పొత్తు అన్నమాట వినిపించిన ప్రతిసారి గులాబీ పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన నిరుత్సాహం అలుముకుంటోంది. ఏపీలో అయితే బిజెపి సంప్రదాయ ఓట్లకు భిన్నంగా ఉంటుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్. అందుకే నేరుగా పొత్తు పెట్టుకోలేక.. అలాగని వ్యతిరేకించలేక రెండు పార్టీలు సతమతం అవుతున్నాయి. అయితే జాతీయస్థాయిలో కూడా ఆ రెండు పార్టీల గురించి చర్చ నడుస్తోంది. బిజెపికి దగ్గర కాలేవు. దూరం కాలేవు అన్నట్టు ఉంది ఆ రెండు పార్టీల పరిస్థితి. రెండు పడవలపై ప్రయాణం మాత్రం ఆ రెండు పార్టీలకు ప్రమాదకరమే.

# మంత్రులపై చంద్రబాబు ఆగ్రహం!

ఈ విషయంలో ఎందుకు విఫలమవుతున్నారని ప్రశ్నించారు.

**విధిగా మంత్రివర్గ సమావేశాలు..**

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి 15 రోజులకు ఒకసారి విధిగా మంత్రివర్గ సమావేశం జరుగుతోంది. అయితే ఇలా సమావేశం జరుగుతున్న ప్రతిసారి చంద్రబాబు మంత్రుల తీరును తప్పుపడుతున్నారు. కానీ వారి వైఖరిలో ఎంత మాత్రం మార్పు రావడం లేదు. అందుకే తాజాగా జరిగిన సమావేశంలో మంత్రులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు ప్రచారం నడుస్తోంది. కొద్దిమంది మంత్రులు తప్ప మిగతావారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ధీటుగా సమాధానం చెప్పకపోవడాన్ని ప్రస్తావించారట. ఇలా మెతక వైఖరితో ఉంటే కుదరదు అని.. గట్టిగా బదులు ఇవ్వాల్సిన అవసరం ఉందని తేల్చి చెప్పారు. జిల్లాల్లో ఏ చిన్న సమస్య తలెత్తిన ఇంచార్జ్ మంత్రులు తక్షణమే చొరవ చూపాలని కూడా ఆదేశించారు. క్షేత్రస్థాయికి స్వయంగా వెళ్లి.. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు.భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని ఉత్తరాంధ్ర మంత్రులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కూడా ఆదేశించారు.

**మారని మంత్రుల తీరు..**

మంత్రుల తీరుపై గతం నుంచి అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చారు చంద్రబాబు. చాలా సందర్భాల్లో అసంతృప్తి కూడా బయటపెట్టారు. అయినా కొందరి వైఖరిలో ఎటువంటి మార్పు రావడం లేదు. మరోవైపు త్వరలో మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం సాగుతోంది. ఇటువంటి తరుణంలో మంత్రుల తీరుపై సీఎం చంద్రబాబు అసంతృప్తి వ్యక్తం చేయడం హాట్ టాపిక్ అవుతోంది. త్వరలో మంత్రుల మార్పు ఉంటుందన్న ప్రచారం పొలిటికల్ వర్గాల్లో ఉంది. ప్రధానంగా గోదావరి జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతానికి చెందిన మంత్రుల మార్పు అనివార్యం అని తెలుస్తోంది. మంత్రివర్గ విస్తరణ పై చాలామంది సీనియర్లు కూడా ఆశలు పెట్టుకున్నారు. అటువంటి వారంతా తమకు చాన్స్ దక్కుతుందని భావిస్తున్నారు.

# బండ్ల గణేష్‌కు షాక్!

(మొదటి పేజీ తరువాయి)

దీంతో ఈ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు యధాతథంగా కొనసాగనుంది. పరమేశ్వర పౌల్ట్రీ ఫార్మర్ లిమిటెడ్ కు సంబంధించి రుణాల నేపథ్యంలో ఈ కేసు ప్రారంభమైంది. ఈ సంస్థ తీసుకున్న రుణాలకు బండ్ల గణేష్ కుటుంబ సభ్యులు హామీదారులుగా ఉన్నారు. రుణ బకాయిలు చెల్లించకపోవడంతో యూనియన్ బ్యాంక్ సర్ఫేసీ చట్టం కింద 2019లో హామీదారుల ఆస్తిని స్వాధీనం చేసుకుంది. 2022లో నిర్వహించిన వేలంలో జూబ్లీహిల్స్ ఆస్తిని సుమారు రూ. 8.51 కోట్లకు విక్రయించింది. ఈ వేలం ప్రక్రియను ప్రశ్నిస్తూ బండ్ల గణేష్ రుణాల వసూళ్ల ట్రిబ్యునల్ ను ఆశ్రయించారు. దీంతో వేలాన్ని రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. అయితే ఈ నిర్ణయాన్ని యూనియన్ బ్యాంక్ తెలంగాణ హైకోర్టులో సవాల్ చేసింది. కేసును పరిశీలించిన హైకోర్టు బ్యాంకు వాదనను సమర్థిస్తూ ఆ తీర్పును రద్దు చేసింది. తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం తిరస్కరించడంతో పాత తీర్పు యధావిధిగా కొనసాగనుంది.

**స్పందించిన గణేష్..**

అయితే బండ్ల గణేష్ ఆస్తులు పోయాయంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. దీంతో బండ్ల గణేష్ స్పందించారు. తన మొత్తం ఆస్తిని కోల్పోయాను అంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని తేల్చి చెప్పారు. కేవలం ఒకే ఒక్క ప్రాపర్టీకి సంబంధించిన విషయంలోనే కోర్టు తీర్పు వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘ వివరణ ఇచ్చారు. షేక్ పేటలోని అపర్ణ సినార్ ర్యాలీలో ఉన్న 500 గజాలకు సంబంధించిన స్థలానికి ఈ వివాదం పరిమితం అని చెప్పుకొచ్చారు. వేలం ద్వారా విక్రయించే ప్రయత్నాన్ని తాను సవాల్ చేసినట్లు తెలిపారు. తెలంగాణ హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టులో తనకు వ్యతిరేకంగా తీర్పు వచ్చిందని కూడా వివరించారు. న్యాయస్థానాల తీర్పుపై తనకు పూర్తి గౌరవం ఉందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తుది తీర్పును సంపూర్ణంగా శిరసావహిస్తున్నట్లు తెలిపారు.

**గతంలో సైతం..**

బండ్ల గణేష్ పై ఆర్థికపరమైన వివాదాలు రావడం ఇది తొలిసారి కాదు. గతంలో చాలాసార్లు చెక్ బౌన్స్ కేసులు కూడా ఆయనపై ఉన్నాయి. సినీ నిర్మాతగా, పౌల్ట్రీ వ్యాపారిగా సుపరిచితులు బండ్ల గణేష్. అయితే యూనియన్ బ్యాంకు రుణానికి సంబంధించిన వివాదం చాలా రోజులుగా కొనసాగుతూ వస్తోంది. ఇప్పుడు తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును యధావిధిగా కొనసాగించాలని.. అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. దీంతో మరో ప్రత్యామ్నాయం లేకపోవడంతో బండ్ల గణేష్ స్పందించారు. భారత న్యాయవ్యవస్థతో పాటు రాజ్యాంగంపై తనకు అపారమైన విశ్వాసం ఉందని.. కోర్టుల ఆదేశాలను పాటించడం ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యత అని గుర్తు చేశారు బండ్ల గణేష్. ఒక్క స్థలం వేలం విషయంలో మాత్రమే సుప్రీంకోర్టు తుది తీర్పు ఇచ్చిందని.. దీనిని ఆసరాగా చేసుకుని తన ఆస్తులను వేలం పడ్డాయని.. మొత్తం ఆస్తిని కోల్పోయానని తప్పుడు ప్రచారం చేయవద్దు అని ఆయన విజ్ఞప్తి చేశారు. తనపై వచ్చే తప్పుడు వార్తలను నమ్మవద్దని ప్రజలకు కోరారు.




# ఇన్చార్జ్ మంత్రి అయితే?!

హై కమాండ్ వద్దకు కొండా సురేఖ, కడియం శ్రీహరి వార్ చేరింది. నిజామాబాదులో సీతక్కకు ఆదరణ కరువు అవుతోంది. షబ్బీర్ అలీ, చంద్రశేఖర్ రెడ్డి ఇష్యూలో రోజురోజుకు పరిస్థితి జఠిలం అవుతోంది. ఉమ్మడి మెదక్ లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోతున్నారు. ఆయనను సీనియర్ నేతలైన దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి, మైనంపల్లి కనీసం లెక్క చేయడం లేదు.

**కనీస గౌరవం దక్కడం లే..**

ఏదైనా ఇన్చార్జ్ మంత్రులకు జిల్లాలో పార్టీ వ్యవహారాలతో పాటు పాలన వ్యవహారాల బాధ్యత ఉంటుంది. కానీ తెలంగాణలో మాత్రం ఇన్చార్జ్ మంత్రుల పరిస్థితి నామమాత్రంగా ఉంది. జిల్లాల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. కానీ స్థానిక నేతల నుంచి వారికి కనీస గౌరవం దక్కడం లేదు. ఏ జిల్లాలో చూసిన ఇన్చార్జ్ మంత్రుల ప్రమేయం లేకుండా నిర్ణయాలు జరిగిపోతున్నాయి. ఆయా జిల్లాల నేతలే తమను లేక చేయకపోవడం.. పార్టీ వివాదాలను పరిష్కరించే పరిస్థితి లేకుండా పోవడంతో మంత్రులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. పరాయి జిల్లాల పర్యవేక్షణ కంటే తమ సొంత జిల్లాలో బెటర్ అన్న రీతిలో పరిస్థితి వచ్చింది.

**మంత్రుల మధ్య సమన్వయం లేక..**

కాంగ్రెస్ పార్టీ పరిస్థితి నానాటికి దిగజారుతోంది. ముఖ్యంగా మంత్రుల మధ్య సమన్వయం లేదు. కొన్ని జిల్లాల నేతలు తాము మంత్రుల కంటే సీనియర్లమని భావిస్తున్నారు. మంత్రి పదవులు ఆశించి దక్కని వారు.. ఇంచార్జ్ మంత్రులను అస్సలు లెక్కచేయడం లేదు. నేతల మధ్య విభేదాలతో ఇన్చార్జి మంత్రులు కూడా జిల్లాల పర్యటనకు సాహసించలేకపోతున్నారు. వారి అనుమతి లేకుండానే జిల్లాల్లో నిర్ణయాలు జరిగిపోతున్నాయి. దీంతో ఇంచార్జ్ మంత్రులను అనే ట్యాగ్ లైన్ తీసేయాలని మంత్రులు సెటైర్లు వేస్తున్నారు. ఎక్కడికక్కడే జిల్లాల్లో పార్టీలో విభేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొందరు సీనియర్లు తమకు తాముగా నియోజకవర్గాల్లో సమస్యలు పరిష్కరించుకుంటున్నారు. కనీసం లెక్కచేయని విధానం కాంగ్రెస్ పార్టీలో కనిపిస్తోంది. ఇలానే కొనసాగితే మాత్రం ఇబ్బందికర పరిస్థితులు తప్పేలా లేవు కాంగ్రెస్ పార్టీకి.

# విద్యార్థి సంఘాల బంద్..



ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) కీలక నిర్ణయం తీసుకుంది. జూలై 24, శుక్రవారం నాడు జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునివ్వడంతో వర్సిటీ అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నీట్ యూజీ 2026 పేపర్ లీకేజీ వ్యవహారం, కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ వంటి వామపక్ష, కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బంద్‌కు పిలుపునిచ్చాయి. ఢిల్లీలో 'ఛలో పార్లమెంటు మార్చ్' నిర్వహించిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారని ఆరోపిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, బంద్ కారణంగా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో అధికారులు ముందుస్తు జాగ్రత్త చర్యగా పరీక్షలను వాయిదా వేశారు. ఈ నిర్ణయం ఓయూ పరిధిలోని అన్ని అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులకు వర్తిస్తుందని స్పష్టం చేశారు. ఇదే క్రమంలో జేఎన్‌టీయూ–హైదరాబాద్ వంటి ఇతర విద్యాసంస్థలు కూడా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాయి.పరీక్షల వాయిదాతో విద్యార్థులకు తాత్కాలికంగా ఊరట లభించినప్పటికీ, అకడమిక్ క్యాలెండర్‌పై దీని ప్రభావం పడనుంది. వాయిదా పడిన పరీక్షల తదుపరి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని వర్సిటీ అధికారులు వెల్లడించారు.

# ఎస్ఐఆర్ గడువును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

**కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్‌ముదిరాజ్**



గండిపేట(క్రైమ్ మిర్రర్): కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం గడువు ఆగస్టు 3వ తేదీ వరకుకొనసాగుతున్న నేపథ్యంలో సద్వినియోగం చేసుకోవాలని కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు నిరుడు శేఖర్‌ముదిరాజ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు నమోదు, వివరాల సవరణ, చిరునామా మార్పు తదితర అవసరమైన మార్పులు చేసుకోవడానికి ఇంకా అవకాశం ఉన్నందున ప్రతి అర్హత కలిగిన ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొంత మంది తమ ఓటు స్వగ్రామంలోనే ఉండాలని భావించి ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయడం లేదని, అయితే ప్రతి ఒక్కరూ తాము ఎక్కడ ఓటరుగా కొనసాగాలనుకుంటున్నారో అక్కడే ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఒక వ్యక్తికి ఒకే చోట మాత్రమే ఓటు హక్కు ఉండాలని, కాబట్టి తాము ఓటు వినియోగించాలనుకునే ప్రాంతంలోనే ఓటరు వివరాలను నమోదు చేసుకుని ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు అని పేర్కొంటూ, చివరి రోజు వరకు వేచి చూడకుండా ఆగస్టు 3వ తేదీలోపు అవసరమైన పత్రాలను సమర్పించి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. అలాగే, ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత లను సంప్రదించి ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని, ప్రతి అర్హత కలిగిన ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిరుడు శేఖర్ ముదిరాజ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థుల న్యాయం కోసం నాంపల్లిలో శాంతియుత ధర్నా

**కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి**

**రాహుల్ గాంధీ అరెస్టు దుర్మార్గం**



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నీట్ పేపర్ లీకేజీలకు నిరసనగా విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర జరుగుతున ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్ గాంధీని అక్రమ అరెస్టుకు నిరసనగా ఏఐసీసీ, టీపీసీసీ, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నాంపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నాంపల్లి బస్టాండ్ సెంటర్ వద్ద నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు నాంపల్లి పరిసర ప్రాంతాలలో శాంతియుత ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలతో విద్యార్థులకు జరుగుతున్న అన్యాయంపై నిరసన కూడిన సంఘీభావం తెలియజేయడం జరిగింది. బిజెపి ప్రభుత్వం గత పది సంవత్సరాల నుండి వివిధ ఉద్యోగ ఎంట్రన్స్ ఎగ్జామ్ లో భాగంగా 152 సార్లు పేపర్లు బీజేపీ ప్రభుత్వం లీకేజీలు చేయించడం జరిగింది. వివీటన్నిటికీ కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నీట్ పేపర్ లీకేజీలకు నిరసన చేస్తున్న అక్రమంగా విద్యార్థిని విద్యార్థులను పోలీసులతో కొట్టించి వారికి మద్దతు తెలుపుతున్న రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడం అందుకు నిరసనగా గురువారం ఏఐసిసి, పిసిసి పిలుపుమేరకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదేశానుసారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాంపల్లి బస్టాండ్ సెంటర్ నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు నాంపల్లి పరిసర ప్రాంతాలలో శాంతియుత ర్యాలీ నిర్వహించడం జరిగింది. అంబేద్కర్ కూడలి వద్ద అంబేద్కర్ కి పూలమాలలు వేసి మనోహరం ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పూల వెంకటయ్య కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎరెడ్ల రఘుపతి రెడ్డి, బట్టు జగన్, నేతల కొండల్, బేకర్ గిరి మెగావత్ చిట్టి శ్రీనివాస్, వెంకన్న నాయక్, కాశిమల్ల జనార్ధన్, మేకల రమేష్ యాదవ్ భత్తుల వంశీ, పానుగంటి వెంకటయ్య గౌడ్, సుధనబోయిన శ్రీను, కోరే యాదయ్య, ఈద శేఖర్, విరమళ్ళ సందీప్ పంతు నాయక్, గిరి వెంకటయ్య, గాదిపాక నాగరాజు, బిరుదోజు యాదమ్మ, వీరమల్ల శైలజ, వివిధ గ్రామాల సర్పంచులు ఉప సర్పంచులు పార్టీ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు పార్టీ యువ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.....

# 26 న హాస్టల్ కథల పుస్తకావిష్కరణ సభ



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** కవి, రచయిత, కళాకారుడు, ఉద్యమ నేత కోమాకుల సీతారాములు రచించిన "హాస్టల్ కతలు " పుస్తకావిష్కరణ కార్యక్రమం జులై నెల 26 న ఉదయం పది గంటలకు నిర్వహిస్తున్నట్లు బహుజన సాహిత్య వేదిక ప్రకటించింది.

హాస్టల్ కథలు పుస్తకావిష్కరణ కార్యక్రమం కరపత్రం భక్త రామదాసు కళాక్షేత్రంలో గురువారం ఆవిష్కరించారు భక్త రామదాసు కళా క్షేత్రం, ఖమ్మం లో నిర్వహిచే ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, రచయిత, ఎ. విద్యా సాగర్, ఐ.ఎ.ఎస్. , మరో రచయిత భంగ్య భూక్య హాజరు కానున్నారని తెలిపారు. కాళోజి అవార్డు గ్రహీత ప్రముఖ కవి, రచయిత ఆర్. సీతారాం అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమం లో ప్రసిద్ధ సినీ సంగీత దర్శకులు, గాయకులు, గద్దర్ అవార్డు గ్రహీత భీమ్స్ సిసిరోలియో ను ఘనంగా సన్మానించనున్నారు ఈ కార్యక్రమం లో ప్రముఖ కవి, రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్, గేజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, కవి, రచయిత అమ్మిన శ్రీనివాస రాజు పాల్గొనబోతున్నట్లు తెలిపారు. మొగిలి వెంకటేశ్వర్లు సమన్వయ కర్త గా వ్యవహరించే ఈ కార్యక్రమం లో కవి, రచయిత, రాచమళ్ళ ఉపేందర్ పుస్తక సమీక్ష చేయనున్నారు. అనేక సాహితీ సంఘాల, ఉద్యగ సంఘాల రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొనే ఈ కార్యక్రమంలో కోమాకుల సీతారాములు దంపతుల సప్తతి ని కూడా నిర్వహించనున్నట్లు బహుజన సాహిత్య వేదిక బాధ్యులు సయ్యద్ ఖుర్షీద్, మద్దెర్ల రమేష్, కోమిరే వెంకన్న, పమ్మి రవి, మావూరి మల్లేశం, బి. ఎల్. వెంకన్న, వజ్రం నాగేశ్వర్ రావు, పంజాల ఐలయ్య, ఉద్యోగ, ఉపాధ్యాయ, సాహితీ సంఘాల బాధ్యులు, ఆ లోచనా పరులు, రచయిత లు, కవులు, మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

# నీట్ వివాదంపై సచిన్ టెండూల్కర్ స్పందన



నీట్–యూజీ 2026 పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్న తరుణంలో, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ స్పందించాడు. కష్టపడి పనిచేసే తత్వానికి, నిజాయతీకి మరియు ప్రతిభకు సముచిత గుర్తింపు లభించే సంస్కృతిని ప్రోత్సహించాలని పిలుపునిచ్చాడు. ఈ మేరకు గురువారం ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సందేశాన్ని పంచుకున్నాడు. ఈ సందర్భంగా తన తండ్రి, ప్రొఫెసర్ రమేశ్ టెండూల్కర్ నేర్పిన విలువైన పాఠాన్ని సచిన్ గుర్తుచేసుకున్నాడు. "పరాజయం పర్వాలేదు కానీ, మోసం మాత్రం చేయకూడదు. విజయం కోసం ఎప్పుడూ అడ్డదారులు తొక్కవద్దని మా నాన్న నాకు చెప్పేవారు. సమాజంలో పెద్దలుగా, మన సంస్కృతిని సరైన మార్గంలో తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని పేర్కొన్నాడు. కేవలం ఫలితాలకే ప్రాధాన్యమిచ్చే సమాజం, ప్రతిభ కంటే అక్రమ మార్గాలనే ఎక్కువగా ఆశ్రయిస్తుందని "తమ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కలేదని విద్యార్థులు నిరాశ చెందడం సహజం. భవిష్యత్తులో వారికి మళ్లీ ఇలాంటి చేదు అనుభవాలు ఎదురుకాకుండా మనమందరం సమష్టిగా కృషి చేయాలి" అని సచిన్ టెండూల్కర్ సూచించాడు. యువత ఆకాంక్షలను పరిరక్షించే దిశగా త్వరలోనే సరైన పరిష్కారాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశాడు.నీట్–యూజీ 2026 పరీక్ష పత్రాల లీకేజీతో పాటు పలు అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు నేపథ్యంలో, ఢిల్లీలోని జంతర్ మంతర్ సహా దేశవ్యాప్తంగా విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బాధితులకు పలువురు ప్రముఖులు తమ మద్దతును ప్రకటిస్తున్నారు.

## నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ వెంకట్ రెడ్డి

**అక్రమంగా నిల్వ చేసిన నకిలీ యూరియా సీజ్.. ఒకరిపై కేసు నమోదు**



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** రైతులకు నకిలీ ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎస్పి వెంకటరెడ్డి హెచ్చరించారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా నిఘా పెంచినట్లు తెలిపారు. అధిక లాభాల కోసం కొందరు వ్యక్తులు రైతులకు తక్కువ ధరల పేరుతో నాణ్యతలేని ఎరువులను విక్రయిస్తూ పంటలకు, రైతుల ఆర్థిక పరిస్థితికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని అన్నారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసే సమయంలో సంచులపై ఉన్న కంపెనీ వివరాలు, తయారీ తేదీ, బ్యాచ్ నంబర్, ధర తదితర అంశాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. అనుమతి పొందిన డీలర్ల వద్ద నుంచే ఎరువులు కొనుగోలు చేయాలని, కొనుగోలు రసీదులను భద్రపరచుకోవాలని చెప్పారు. కల్వకుర్తి మండలంలోని లింగసానిపల్లి గ్రామంలో రైతులకు అనుమానాస్పద ఎరువులు విక్రయించిన అశోక్ కుమార్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. రైతులను మోసం చేసే వారిపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, ఎక్కడైనా నకిలీ ఎరువుల విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందితే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.సమావేశంలో సీఐ భీమ్ కుమార్, ఎస్ఐ కురుమూర్తి, వ్యవసాయ అధికారి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# యువత ఆక్రోశానికి.. సమాధానమేదీ?

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. వరుసగా నాలుగోరోజు కూడా ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. సమావేశాలు సజావుగా సాగడం లేదు. నీట్ లీకేజీపై ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు దిగింది. నీట్ లీకేజీకి బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సంసద్ చలో ఆందోళనకు పిలుపునిచ్చింది. వారి ఆందోళనలో వందశాతం న్యాయం ఉంది. ఎందుకంటే పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థులు...పాలకులు అయినప్పుడు ప్రజలు స్పందిస్తారు. నిలదీస్తారు. నీట్ పరీక్ష వల్ల జరిగిన గందరోగళం ఎందరినో బలితీసుకుంది. ఎందరో తల్లిదండ్రులు క్షోభకు గురయ్యారు. దీనిని ఓ చిన్న సమస్యగా ప్రభుత్వం భావించి ఉండవచ్చు. కానీ విద్యార్థులకు మాత్రం ఇది జీవన్మరణ సమస్య. ఇకపోతే నాలుగు రోజులుగా గందరగోళం జరుగుతున్నా ప్రధాని మోడీ మౌనం వీడడం లేదు. కేవలం ఎక్స్ వేదికగా కఠినంగా వ్యవహరిస్తామని, నీట్ దోషుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. దేశంలో ఓ పెద్ద ఆందోళన జరుగుతంటే ఇదేనా ప్రధానిగా ఉన్న వ్యక్తి చేయాల్సిన పని. మణిపూర్ అల్లర్లు, ఢిల్లీలో రైతుల ఆందోళన, నీట్ పరీక్షా పేపర్ లీకేజీ, అయోధ్య విరాళాల చోరీ..ఇటీవల వరుసగా జరిగిన సంఘటనలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటిపై పార్లమెంటులో చర్చించడం జరగాలి. ప్రధాని మోడీ మౌనం వీడి పార్లమెంట్‌కు వచ్చి, నేరుగా సమాధానం చెప్పాల్సిన ముఖ్యమైన అంశాలు. దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను మౌనమునిగా విమర్శించిన మోడీ ఇప్పుడు అంతకు మించి మౌనంగా మారారు. పార్లమెంట్ జరుగుతన్నా రాకుండా చోద్యం చూస్తూ ఎక్స్‌లో పోస్టులు పెట్టడం సరికాదు. ఇక్కడ సమాధానం చెప్పడం అంటే దేశప్రజలకు సమాధానం చేరవేయడంగా గుర్తించాలి. బాధ్యతగల ప్రధానిగా మోడీ పార్లమెంట్‌కు వచ్చి సమాధానం ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. ఆయన వందిమాగధులు ఇదంతా విపక్షాలతో తమకున్న పంచాయితీలాగా సవాళ్లు విసరుతున్నారు. దేశం తీవ్ర ఆందోళనలో ఉంటే ఇదేనా పాలక పార్టీ వ్యవహరించే తీరు. ఇకపోతే దేశంలోని వ్యవస్థల్లో అవినీతి పాతుకుపోయిందనడానికి నీట్ పేపర్ లీకేజీ వంటివి పరాకాష్టగా చూడాలి. అవినీతి అన్నది రాజకీయ నాయకుల హక్కుగా మారింది. ప్రజలను ఏమార్చి, అధికారం చేపట్టగానే, ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప దేశహితం, దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లేందుకు అసవరమైన నిర్ణయాలు తక్కువే జరుగుతున్నాయి. ఇటీవల రామమందిరంలో విరాళాల చోరీ ఘటన తెలిసిందే. అవినీతి కేసుల్లో దోషులకు మరణశిక్ష విధించాలి. అవినీతి సాధారణమేనని సగటు భారత పౌరులు ఆలోచించే పరిస్థితి నెలకొన్నది. దొరికే వరకు కూడా ఇది తప్పు అని కూడా భావించడంలేదు. వ్యవస్థలో అవినీతిని రూపుమాపాలని ప్రభుత్వం నిజంగా భావిస్తే, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని సవరించాలి. దోషులకు మరణ శిక్ష విధించేలా మార్పులు చేయాలి. ఉన్న చట్టాలతోనే కఠిన శిక్షలు విధించాలి. ఇకపోతే దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. గత పదేళ్లలో ఏకంగా 152 పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా బాధ్యులైన వారికి పడిన శిక్షలు మాత్రం సున్నా అని ధ్వజమెత్తారు. నిజంగానే ఇది ముమ్మాటికీ నిజం. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడానికి ముందే ప్రధాని మోడీ పార్లమెంటులో స్పందించి ఉంటే ఈ గందరగోళం చెలరేగేది కాదు. ప్రతి ఆందోళనను రాజకీయ కోణంలో చూడడం, విపక్షాలను తిట్టిపోయడం వల్ల సమస్యలను పాలకులు గుర్తించడం లేదు. ఒకప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారత విద్యా వ్యవస్థ.. అక్రమాలు, లీకేజీలకు నిలయంగా మారింది. దేశంలో పేపర్ లీకేజీలు ఒక పెద్ద మాఫియాగా మారాయి. దీని వెనుక ఉన్న బడాబాబులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతూ వస్తోంది. జంతర్ మంతర్ వద్ద భారతీయ యువత నిరసనలను సీరియస్‌గా తీసుకోవాల్సి ఉండగా, దానిని అణచివేయడం ఎలా అన్న ఆలోచననే అధికారపక్షం ఆలోచన చేయడం సరికాదు. నిరసనల్లో లక్ష మందికి పైగా యువకులు, విద్యార్థులు పాల్గొని ఉంటారని ఫోటోలు స్పష్టంగా సూచిస్తున్నాయి. తొలుత ఒక మార్చ్‌గా అనుకున్నది తరువాత నిరసన ప్రదర్శనగా పరిణమించింది. ఎంతోకాలంగా ఆగ్రహంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని అనుకూలంగా తీసుకుని, వెల్లువెత్తి జనసంద్రంగా మారినట్లు మనకు కనిపిస్తోంది. మన దేశంలో రాజకీయ పార్టీల ర్యాలీలకు డబ్బులు, ఇతర ప్రలోభాలతో జనాన్ని సమీకరించడం పరిపాటి. అయితే ఈ నిరసన ప్రదర్శన అలా జరగలేదు. జంతర్ మంతర్‌కు చేరిన వారందరూ తమకు తాముగా స్వచ్ఛందంగా వచ్చినవారే. ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలలో విజ్ఞప్తులకు ప్రతిస్పందించి స్వచ్ఛందంగా వచ్చినవారే. ఎవరి ప్రయాణ ఏర్పాట్లు వారే చేసుకుని, సుదూర ప్రాంతాల నుంచి నడిచి వచ్చినవారు చాలామంది ఉన్నారు. ఇంకో ముఖ్య విషయమేమంటే వచ్చిన వారిలో యువ మహిళల శాతం అత్యధికంగా ఉండడం. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నవారిలో అత్యధికులు ఇటువంటి నిరసనలలో తొలిసారి పాల్గొన్నవారే కావడం మరో వాస్తవం. కేవలం నీట్ తదితర ప్రశ్నపత్రాల లీక్‌కు రగిలిపోయి మాత్రమే యువత జంతర్ మంతర్ వద్ద ధర్నాకు రాలేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. దేశంలో పెచ్చరిల్లు తోన్న నిరుద్యోగం, అవినీతిమయమైన అధికార వ్యవస్థలు, రాజకీయ పార్టీల కపటాలు అన్నీ కలగలిపి వారిని ఈ నిరసనలో పాల్గొనేలా ప్రోత్సహించాయనే చెప్పాలి. విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ఉద్యోగాలను వెతుక్కుంటున్న వారు, నియామకాలలో అవకతవకలకు బాధితులైనవారు ఎందరో ఆ నిరసనకారుల్లో ఉన్నారని చెప్పక తప్పదు. దేశ పాలనావ్యవస్థల్లో అవినీతి మితిమీరి, రాజకీయ అవినీతి పెరిగి పోవడం, పాలకుల విలాసాలు, ప్రజలేమో అవస్థల పాలవుతున్న తీరు కారణంగా యువత నిరసనలకు ఉద్యమించిందని చెప్పక తప్పదు. దీనికి విదేశీ హస్తం ఉందనో లేదా మరే ఇతర కారణాలనో చూపి మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు కూడా మంచిది కాదు.

# పునాది కదులుతోంది...

# నమ్మకం తరుగుతోంది!

**మానవ సంబంధాలకు, సామాజిక మనుగడకు ప్రాథమిక మూలస్తంభం ఏది? అనే ప్రశ్నకు నిస్సందేహంగా వినిపించే ఏకైక సమాధానం నమ్మకం . నేటి ఆధునిక ప్రపంచంలో మైలురాళ్లుగా భావిస్తున్న సకల భోగభాగ్యాలు, ఆర్థిక సంపద, అధికారం, అపార సాంకేతిక పరిజ్ఞానం ఇవేవీ మనుషులను కలసికట్టుగా ఉంచలేవు. ఒక సుదృఢమైన కుటుంబ వ్యవస్థ నిలబడాలన్నా, వాణిజ్య వ్యాపార లావాదేవీలు సజావుగా సాగాలన్నా, ప్రజాస్వామ్య వ్యవస్థ పరిపాలన సాగించాలన్నా పౌరుల మధ్య పరస్పర విశ్వాసంతో పాటు వ్యవస్థలపై దృఢమైన నమ్మకం అత్యంత ఆవశ్యకం.అయితే, ప్రస్తుత ఆధునిక కాలంలో ఆ పునాది రాయి తీవ్రంగా కదిలిపోతోందనడానికి అనేక స్పష్టమైన ఆనవాళ్లు సమాజంలో దర్శనమిస్తున్నాయి.**

తోటి పౌరుగువారిపై అనుమానపు చూపులు, నిరంతరం ప్రజాప్రతినిధులపై నిరసనలు, పత్రికలు, వార్తా ఛానళ్ల విశ్వసనీయతపై సందేహాలు, మిత్రుల మధ్య నానాటికీ పెరుగుతున్న మానసిక దూరాలు ఇవన్నీ మన సమాజం ఒక తీవ్రమైన మానసిక వ్యాధితో బాధపడుతోందనడానికి ప్రత్యక్ష నిదర్శనాలు. ఈ పరిస్థితినే నేడు మేధావులు విశ్వాస సంక్షోభం గా అభివర్ణిస్తున్నారు. సమాజాన్ని కుదిపేస్తున్న ఈ తీవ్ర వైఫల్యానికి గల కారణాలను విస్తృతంగా విశ్లేషించాల్సిన అవసరం ఏర్పడింది.గడిచిన దశాబ్ద కాలంలో డిజిటల్ విప్లవం ద్వారా సామాజిక మాధ్యమాలు మన నిత్య జీవితాల్లో కీలక భాగంగా మారిపోయాయి. ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక వేదికలు సమాచార ప్రసారాన్ని అత్యంత వేగవంతం చేశాయనడంలో సందేహం లేదు. కానీ, ఇదే వేగం అబద్ధాలు, అర్ధసత్యాలు, సమాజాన్ని విభజించే కుట్ర సిద్ధాంతాలు శరవేగంగా వ్యాప్తి చెందడానికి ప్రధాన కారణమైంది. ఒక వార్తా కథనం వెనుక ఉన్న నిజానిజాలను సరిచూసుకునే కనీస ఓపిక కూడా లేకపోవడంతో, పౌరులే సమాజంలో గందరగోళానికి కారకులవుతున్నారు. ఏది సత్యమో, ఏది పచ్చి అబద్ధమో బోధపడని అయోమయ పరిస్థితుల్లో ఒకరిపై ఒకరికి నమ్మకం సన్నగిల్లుతోంది.ప్రస్తుత రాజకీయ క్షేత్రంలో ప్రజా సంక్షేమం కంటే స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా మారాయి. పీఠాన్ని దక్కించుకోవడానికి రాజకీయ పక్షాలు ప్రజలను కుల, మత, ప్రాంతీయ ప్రాతిపదికన తీవ్రంగా విభజిస్తున్నాయి. ఎన్నికల ప్రచార హోరులో సాధ్యం కాని హామీలను గుప్పించి, పీఠమెక్కిన మరుక్షణమే వాటిని తుంగలో తొక్కడం పరిపాటిగా మారింది. ఫలితంగా, రాజకీయ నాయకులపై, ప్రజాస్వామ్య వ్యవస్థల తీరుపై ప్రజలకు నిరాశ, నిస్పృహలు పెరిగిపోతున్నాయి. రాజకీయాల్లో నాయకులందరూ ఒకే దారి అనే తీవ్ర అసంతృప్తి జనాల్లో వేళ్లూనుకుంటోంది. పాలకులు పాలితుల మధ్య పరస్పర నమ్మకం సన్నగిల్లితే ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుంది.న్యాయస్థానాలు, పోలీసు యంత్రాంగం, ప్రభుత్వ కార్యాలయాలు పౌరులకు రక్షణ, సత్వర న్యాయం అందించాల్సిన ప్రాథమిక వ్యవస్థలు. అయితే, వీటిలో పెనుభూతంలా దాపురించిన అవినీతి, కాలయాపన, పక్షపాత ధోరణుల కారణంగా సామాన్య పౌరుడు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నాడు. లంచాలు ఇస్తేనే పనులు జరుగుతాయనే నగ్న సత్యం సామాన్యుడిని తీవ్రంగా నిరాశపరుస్తోంది. ప్రతికూల అనుభవాల వల్ల రాజ్యాంగబద్ధ వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం క్రమంగా తుడిచిపెట్టుకుపోతోంది.దేశంలో ధనిక, పేద వర్గాల మధ్య వ్యత్యాసం రోజురోజుకూ ఆందోళనకరంగా పెరుగుతోంది. ఒకవైపు కొద్దిమంది అపారమైన విలాసవంతమైన జీవితాన్ని గడుపుతుంటే, మరోవైపు మెజారిటీ ప్రజలు కనీస ప్రాథమిక అవసరాల కోసం అల్లాడిపోతున్నారు. ఈ ఆర్థిక అసమానతలు సమాజంలో అసూయ, అసంతృప్తి, అనుమానాలను పెంచి పోషిస్తున్నాయి. ఈ చట్టాలు, వ్యవస్థలు కేవలం ధనవంతుల కొరకే పనిచేస్తాయి అనే నమ్మకం ప్రజల మనస్సులో బలపడినప్పుడు సత్సంబంధాలు దెబ్బతింటాయి.ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు, గ్రామీణ సంస్కృతి మానవ అనుబంధాలకు, ఆప్యాయతలకు నిలయంగా ఉండేవి. నేటి శరవేగవంతమైన నగరీకరణ, ఉద్యోగాల్లో విపరీతమైన ఒత్తిడి, స్వార్థపూరిత ధోరణుల వల్ల మనుషుల మధ్య ఆత్మీయతలు దూరమవుతున్నాయి.



ముఖాముఖి పలకరించుకునే సమయం లేక, కేవలం స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌లకే పరిమితమవ్వడం వల్ల మనుషుల మధ్య అపార్థాలు, అపనమ్మకాలు చోటుచేసుకుంటున్నాయి.వార్తా సేకరణ రంగంలో వాస్తవాల కంటే టీఆర్‌పీ రేటింగ్‌లు, వ్యాపార లాభాలే ప్రాధాన్యతగా మారాయి. నిష్పక్షపాతంగా, సత్యసంధతతో కూడిన వార్తలను అందించాల్సిన మాధ్యమాలు సంచలనాల కోసం, ఏకపక్ష కథనాల కోసం మొగ్గు చూపుతున్నాయి. దీంతో, ప్రజలు వార్తా సంస్థలను నిఖార్సయిన సమాచార వనరుగా భావించడం మానేశారు.ఈ భయంకరమైన విశ్వాస సంక్షోభం నుండి సమాజం పునరుద్ధరణ పొందాలంటే అన్ని రంగాల్లోనూ విస్తృతమైన మార్పులు రావలసి ఉంది. సోషల్ మీడియాలో వచ్చే ప్రచారాలను పౌరులు విచక్షణతో విశ్లేషించడం అలవాటు చేసుకోవాలి. ప్రభుత్వాలు చట్టబద్ధత, పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరిస్తూ అవినీతి రహిత పాలనను అందించాలి. విద్యాసంస్థల్లో పాఠ్యాంశాలతో పాటు చిన్ననాటి నుంచే నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను నేర్పించాలి. సమాజంలో మనుషుల మధ్య ఆన్‌లైన్ బంధాల కంటే ప్రత్యక్ష సంభాషణలు, పరస్పర సానుభూతిని పెంపొందించే సామాజిక కార్యక్రమాలు పెరగాలి.

ఒక్కసారి దెబ్బతిన్న విశ్వాసాన్ని తిరిగి నిర్మించడం అంత సులువైన విషయం కాదు. కానీ, పట్టుదలతో ప్రయత్నిస్తే అది అసాధ్యమేమీ కాదు. సమాజంలో నిజాయితీ, పారదర్శకత, పరస్పర గౌరవ భావాలను పునరుద్ధరించినప్పుడు మాత్రమే ఈ సంక్షోభం నుండి గట్టెక్కడం సాధ్యమవుతుంది. ఇది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు; ప్రతి పౌరుడు తనవంతు బాధ్యతగా గుర్తించి, నిజాయితీతో ప్రవర్తించినప్పుడే సస్యశ్యామలమైన, నమ్మకంతో కూడిన భవిష్యత్తును రాబోయే తరాలకు కానుకగా అందించగలం.




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169


## దమ్ముంటే నీట్‌పై చర్చకు రావాలి

### విపక్షాలకు బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ సవాల్



న్యూఢిల్లీ,జులై దేశంలో ప్రకంపనలు పుట్టిస్తోన్న నీట్ పరీక్ష వ్యవహారం, పేపర్ లీక్‌ల అంశంపై పార్లమెంట్ వేదికగా ఓపెన్ డిబేట్‌కు సిద్ధమా అని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విపక్షాలకు సవాల్ విసిరారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు విపక్ష కూటమి పార్లమెంట్‌లో చర్చకు రాకుండా పారిపోతోందని, సభ ముందుకు వస్తే వారి 'ద్వంద్వ నీతి' బయట పడుతుందనే భయంతోనే వెనకడుగు వేస్తున్నారని నితిన్ నబిన్ ఆరోపించారు. పేపర్ లీక్ దోషులకు కఠిన శిక్షలు ఖరారు చేసేందుకు 'ఫాస్ట్ ట్రాక్ కోర్టులు' ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటన అనంతరం రాహుల్ గాంధీ తీవ్ర విమర్శల నేపథ్యంలో బీజేపీ అధ్యక్షుడు ఈ వ్యాఖ్యలు చేశారు. మీడియాతో మాట్లాడిన నితిన్ నబిన్ ప్రతిపక్షాల తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించి ప్రతి అంశంపైనా లోక్‌సభలో చర్చించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి సిద్ధంగా ఉంది. ఔఇఇ÷ సహా ఏ అంశంపైనైనా చర్చకు మేము సిద్ధం, మీరు సిద్ధమా? పార్లమెంట్ వేదికగా చర్చకు రావాలని రాహుల్ గాంధీకి సవాల్ విసురుతున్నాం' అని ఆయన అన్నారు. 'రాహుల్ గాంధీ రాజకీయ ప్రస్థానం అంతా పారిపోవడమే. దాదాపు 50-60 ఏళ్లుగా యువతను వంచించడం, రెచ్చగొట్టడం, దారి మళ్లించడమే కాంగ్రెస్ చరిత్ర. అందుకే సభలో చర్చకు వస్తే తమ రంగు బయటపడుతుందని భయపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. విపక్షాలు యువతను కేవలం నిరసనకారులుగా, 'రాళ్లు విసిరేవారిగా' మాత్రమే చూశాయని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం యువతకు సురక్షితమైన, ప్రకాశవంతమైన భవిష్యత్తును అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## నీట్‌పై విద్యార్థుల ఆక్రందన సబబే

### దానికి సానుకూలంగా స్పందించాల్సిందే

### ప్రభుత్వ విధానాలను తూర్పారా బట్టిన కమల్ హాసన్

న్యూఢిల్లీ,జులై: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలకు ప్రముఖ నటుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ మద్దతు ప్రకటించారు. విద్యార్థుల ఆందోళనలపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. 'ఒక బిడ్డ ఏడ్చినప్పుడే మనం వినాల్సింది. కానీ ఎంతోమంది పిల్లలు ప్రాణాలు కోల్పోయే వరకు వేచి చూశాం. నేర్చుకోవడం స్థానంలో శిక్షణ, జిజ్ఞాస స్థానంలో ఆందోళన, ప్రతిభ స్థానంలో నేర ప్రవృత్తి చోటుచేసుకుంది. ఇది కుళ్లిపోయిన వ్యవస్థ' అని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు సమాధానాలు, అవకాశాలు అందించాల్సిన వ్యవస్థ వారిని అడ్డంకులు, ఒత్తిళ్లు, నిరాశల వైపు నెట్టివేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'పిల్లలకు సమాధానాల బదులుగా అడ్డంకులు, లాఠీలు ఎదురైతే అది ఒక దేశ వైఫల్యానికి సంకేతం' అని పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త, విద్యా సంస్కరణల కోసం పోరాడుతున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను ఉద్దేశించి కమల్ హాసన్ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. 'దేశానికి రాబోయే ప్రయాణంలో మీ అవసరం ఉంది. దయచేసి మీ నిరాహార దీక్షను విరమించండి' అంటూ కోరారు. అదేవిధంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన భావోద్వేగ సందేశం ఇచ్చారు. 'భారతదేశ బిడ్డలారా.. మీరే మాలో ఉత్తములు. మీరు మీ కర్తవ్యాన్ని నెరవేర్చారు. ఇప్పుడు దేశం మీకు తన కర్తవ్యాన్ని నెరవేర్చాల్సిన సమయం వచ్చింది. మీ కలలు ఎల్లప్పుడూ మా వైఫల్యాల కన్నా ఉన్నతంగా నిలవాలి' అని పేర్కొన్నారు.

## కల్వకుర్తిలో ఘనంగా తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీజేఏ)

# 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (టీజేఏ) 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గురువారం కల్వకుర్తి పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. సమాజ సేవే లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేయడంతో పాటు, జర్నలిస్టుల సంక్షేమంపై అవగాహన కల్పిస్తూ సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని టీజేఏ సేవలను అభినందించారు. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవా కార్యక్రమాలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జర్నలిస్టులు కేవలం వార్తలను అందించే వారే కాకుండా సమాజానికి సేవ చేసే బాధ్యతను కూడా నిర్వర్తించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ జర్నలిస్టు ప్రహ్లాద్, నాగర్ కర్నూల్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు దస్తగిరి, కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శివరాం, శ్యామ్ సుందర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించిన అతిథులు, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమం అనంతరం సీనియర్ జర్నలిస్టు ప్రహ్లాద్‌తో పాటు నాగర్ కర్నూల్ జిల్లా టీజేఏ నాయకులు, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు దస్తగిరిని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. వారి జర్నలిజం సేవలను కొనియాడుతూ నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సమాజానికి బాధ్యతాయుతమైన సమాచారాన్ని అందించడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, అక్రిడిటేషన్, బీమా, ఆరోగ్య భద్రత, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. జర్నలిస్టుల ఐక్యతే సంఘం బలమని, ప్రతి ఒక్కరూ సంఘ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ప్రాంతానికి చెందిన సీనియర్, యువ జర్నలిస్టులు, టీజేఏ సభ్యులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా టీజేఏ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీజేఏ నాయకులు మహమ్మద్ యూసుఫ్ బాబా, ప్రసాద్ గౌడ్, తస్లీమొద్దీన్, చిగుళ్లపల్లీ మధు, యాదగిరి, హాసన్, అశోక్ గౌడ్, బాల్ రాజు, ఆవ గణేష్, హబీబ్, కంఠం దామోదర్, పాండు బాల చందర్, బాలు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## కల్వకుర్తి క్రీడాకారులు స్పోర్ట్స్ స్కూల్ కు ఎంపిక

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి కి చెందిన కీర్తి, తుకారాం లు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ కు ఎన్నిక కావడం పట్ల ఫుట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల రాజేందర్, కార్యదర్శి విజయభాస్కర్ అభినందించారు. కల్వకుర్తి పట్టణం మున్సిపాలిటీ లో లేబర్ గా పనిచేస్తున్న లావణ్య కుమారుడు తుకారం, మేస్త్రి పని చేసుకునే సాయిలు కూతురు కీర్తి అత్యుత్తమ ప్రతిభతో స్పోర్ట్స్ స్కూల్ కు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు ఫుట్బాల్ గ్రౌండ్లో ఫుట్బాల్ ఆడడం, టోర్నమెంట్లో పాల్గొనడం వల్ల తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో వారికి అడ్మిషన్ లభించడం జరిగిందని చెప్పారు. ఎన్నో ప్రయాసలు ఎదుర్కొని గత కొన్ని సంవత్సరాలుగా కోచ్ వెంకట్ రాములు శిక్షణలో రోజు నాలుగు గంటల ప్రాక్టీస్ తో ఈరోజు తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో సెలెక్ట్ కావడం జరిగిందని క్రీడాకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



## ఘనంగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి జన్మదిన వేడుకలు

**సంస్థాన్ నారాయణపురం, జూలై 23(క్రైమ్ మిర్రర్):** సంస్థాన్ నారాయణపురం గ్రామ సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి జన్మదిన వేడుకలు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి శాలువాలతో సన్మానం చేసిన వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, సర్పంచ్ అభిమానులు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ, వార్డు సభ్యులు సూర పెల్లి వెంకటేష్, బల్గురి శివ, కట్ల వనజ భాస్కరాచారి, మహమ్మద్ అలీమా యూసుఫ్ ఖాన్, సింగపంగా ప్రశాంతి రమేష్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు చిలుకూరి శీను, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బద్దుల మురళి యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ రమేష్ బాబు, కారోబార్ పున్నం యాదగిరి, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గునిగంటి రాజు గౌడ్, మారగోని శంకర్ గౌడ్, పల్లె ఆనంద్ గౌడ్, గ్రామ శాఖ సహాయ కార్యదర్శి రేవనపల్లి గోపాల్, యువజన కాంగ్రెస్ నాయకులు బానోతు కిరణ్ నాయక్,వడ్డేపల్లి శివప్రసాద్, ఈసం శివకుమార్, మందుగుల దానయ్య, వడ్డేపల్లి శివప్రసాద్, బానోత్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.




## ఒడిశాలోని పూరీలో కేటీఆర్ సైకత శిల్పం....

### కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఏర్పాటు....

### పూరీ తీరాన ఏర్పాటు చేసిన చిర్రా రవీందర్ యాదవ్.....

### సైకత శిల్పంను ఏర్పాటు చేసిన శేరిలింగంపల్లి ఉద్యమకారుడు చిర్రా రవీందర్ యాదవ్....

శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ : భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఒడిశా రాష్ట్రంలోని పూరీ తీరాన ఏర్పాటు చేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటుంది. 50వ జన్మదినం సందర్భంగా పూరీ తీరాన ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. శేరిలింగంపల్లికి చెందిన ఉద్యమకారుడు చిర్రా రవీందర్ యాదవ్ సైకత శిల్పంను ఏర్పాటు చేశారు. కేటీఆర్ పై తమకు ఉన్న అభిమానాన్ని చాటారు. తెలంగాణ ఫ్యూచర్ సీఎం అంటూ పేర్కొన్నారు. టూరిస్టులు కేటీఆర్ సైకత శిల్పం చిత్రాన్ని తమ ఫోన్ లల్లో ఫోటోలు తీసుకొని మురిసిపోయారు. తెలంగాణ ఫ్యూచర్ సీఎం కేటీఆర్ అంటూ జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. తెలంగాణలోని కేటీఆర్ కోట్లాది మంది ప్రజల నమ్మకం కేటీఆర్ అని నిర్వాహకులు పేర్కొన్నారు. మారింది ప్రభుత్వమే.. ప్రజల మనస్సులో స్థానం కాదు, ఫ్యూచర్ సీఎం ఆఫ్ తెలంగాణ అంటూ సైకత శిల్పంలో పేర్కొన్నారు. సైకత శిల్పంను ఏర్పాటు చేసిన శేరిలింగంపల్లి ఉద్యమకారుడు చిర్రా రవీందర్ యాదవ్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో వచ్చేది భారాస ప్రభుత్వమేనని వెల్లడించారు. పార్టీ అధినేత కేసీఆర్ మార్గదర్శకంలో కేటీఆర్ నాయకత్వంలో బ్రహ్మాండమైన మెజార్టీని సాధించబోతున్నామని తెలిపారు. ప్రజలే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తరమి కొట్టే పరిస్థితులు దగ్గర్లోనే ఉన్నాయని, కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని వెల్లడించారు. ఈ సందర్భంగా కేటీఆర్ బర్త్ డే వేడుకలను ఘనంగా చిర్రా రవీందర్ యాదవ్ నిర్వహించారు. పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు.

## ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం కి శుభాకాంక్షలు తెలియజేసిన వెలిమినేడు ఉప సర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య గౌడ్



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం వెలిమినేడు గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వేముల వీరేశం కి మంత్రి హోదా వచ్చిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ నోముల రామకుమార్, హెల్మెట్ గ్రామ శాఖ అధ్యక్షులు రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ బొంతల అంజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అంతటి పారిజాత నరసింహ గౌడ్ ,వేలిమినేడు మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు చీమల వీరేశం, సహాయ సెక్రెటరీ తాటికొండ సత్యనారాయణ, యాదవ సంఘం చైర్మన్ బైకనీ నాగరాజు, నాయకులు కాటం సత్తయ్య, గోలి గణేష్, చింతకాయల శివకృష్ణ, నాతి స్వామి, తదితరులు పాల్గొన్నారు

## శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ నేతలతో సమీక్షా సమావేశం..



శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ : ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. మియాపూర్ డివిజన్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ , శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ లు హాజరై సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో పార్టీ శ్రేణుల బాధ్యతపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు కూడా ఓటర్ల జాబితా నుంచి తొలగించబడకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి డివిజన్‌లో సర్ పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి ఇంటికి చేరుకుని ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నాయా లేదా పరిశీలించడంతో పాటు, అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటరు నమోదు వివరాలు సరైనవిగా, తాజాగానూ ఉన్నాయో లేదో నిర్ధారించాలని సూచించారు. సర్ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారమ్‌ల సేకరణ నుంచి వాటి ఆన్‌లైన్ నమోదు వరకు ప్రతి దశను జాగ్రత్తగా పర్యవేక్షించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ప్రక్రియలో భాగస్వామ్యమై, తన పేరు ఓటర్ల జాబితాలో నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని నాయకులు కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజలతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మియాపూర్ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్ తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలి

### కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్



**కూకట్ పల్లి, జూలై 23 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని గాయత్రి నగర్, పర్వత్ నగర్ డివిజన్లలో నిర్వహించిన ఎస్ఐఆర్ఐ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్) కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జి, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పరిశీలించి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, అలాగే ఎలాంటి పొరపాట్లు లేకుండా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేలా కృషి చేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి ఓటరికి ఆ హక్కు వినియోగించే అవకాశం కల్పించాల్సిన బాధ్యత మనందరిదేనని ఆయన పేర్కొన్నారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్ల సవరణ, తొలగింపులు వంటి అంశాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటికీ వెళ్లి సహాయం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి నుంచి బలమైన వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి అర్హులైన ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేస్తుందని బండి రమేష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము వేణు, మస్తాన్ రెడ్డి, వేముల సత్యం, కనకయ్య రాజు, సేవాదళ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# పేద విద్యార్థుల మోములో ఆనందం.. ‘బొబ్బ’ చారిటబుల్ ట్రస్ట్ విద్యా కానుక

## కేటీఆర్ 50వ జన్మదినం సందర్భంగా ‘గిఫ్ట్ ఏ స్మైల్’

## రూ. 3 లక్షల విలువైన 5000 నోట్ బుక్స్, 600 పెన్సిల్ బాక్సుల పంపిణీ....

**చందానగర్ క్రైమ్ మిర్రర్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) 50వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని చేపట్టిన ‘గిఫ్ట్ ఏ స్మైల్’ కార్యక్రమం చందానగర్ డివిజన్‌లో అంబరాన్నంటింది. సామాజిక బాధ్యతలో ఎప్పుడూ ముందుండే మాజీ కార్పొరేటర్, ‘బొబ్బ చారిటబుల్ ట్రస్ట్’ డైరెక్టర్ బొబ్బ నవత రెడ్డి పేద విద్యార్థులకు బాసటగా నిలుస్తూ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. నాయకుడి జన్మదినాన్ని పేదలకు ఉపయోగపడేలా అర్థవంతంగా జరుపుకోవాలన్న సంకల్పంతో.. ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు రూ. 3 లక్షల నిధులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భారీ ఎత్తున విద్యా సామగ్రిని బహుమతిగా అందించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం బొబ్బ నవత రెడ్డి, బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ తీసుకున్న ఈ ప్రత్యేక చొరవ పట్ల స్థానికంగా విశేష ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఐదు పాఠశాలలు.. 600 మంది విద్యార్థులు ఈ పంపిణీ కార్యక్రమానికి మాజీ మినిమం వేజ్ బోర్డ్ చైర్మన్ సామ వెంకట్ రెడ్డి, బొబ్బ నవత రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఉమ్మడి చందానగర్ డివిజన్ పరిధిలోని ఐదు ప్రభుత్వ పాఠశాలలను ఈ ‘గిఫ్ట్ ఏ స్మైల్’ కోసం ఎంపిక చేశారు. ఎం.పి.పి ఉర్దూ మీడియం స్కూల్,



వేముకుంట, ఎం.పి.పి తెలుగు మీడియం స్కూల్, వేముకుంట,వేమన వీకర్ సెక్షన్ ఎం.పి.పి స్కూల్, శివాజీ నగర్ బస్తీ ఎం.పి.పి స్కూల్, ఇందిరా నగర్ బస్తీ ఎం.పి.పి స్కూల్, ఈ ఐదు పాఠశాలల్లో చదువుకుంటున్న సుమారు 600 మంది విద్యార్థులకు 5000 కు పైగా నోట్ బుక్స్, 600 పెన్సిల్ బాక్సులను (ఒక్కో బాక్సులో 2 పెన్నులు, ఒక పెన్సిల్, స్కేల్, షార్పనర్, రబ్బర్) ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. నాణ్యమైన విద్యా సామగ్రి ఉచితంగా దక్కడంతో పేద విద్యార్థుల మొహాల్లో చిరునవ్వులు విరబూశాయి.

**ఆదర్శంగా ‘బొబ్బ చారిటబుల్ ట్రస్ట్’ సేవలు**

పేదరికంలో ఉన్న విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉన్నత లక్ష్యంతో బొబ్బ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు కొనియాడారు. ఈ బృహత్తర కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్ శర్మ, రాజన్న, ఎం.డి సలీం, చందర్ రావు, నగేష్ రెడ్డి, ప్రమోద్, అంజి, శేఖర్, వంశీ రెడ్డి, రామా రావు, అనంత రెడ్డి, శభన, సునీత, శ్రీనులతో పాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, స్థానికులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



## శ్రీ జగదాంబిక వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాల్లో ప్రత్యేక పూజలు..

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్:** మియాపూర్ డివిజన్‌లోని ఎస్.ఆర్. ఎస్టేట్స్ కమ్యూనిటీ హాల్‌లో గంగాధర శాస్త్రి, శ్రీమతి రమాదేవి ప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ శ్రీ జగదాంబిక వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 8వ రోజు నిర్వహించిన ప్రత్యేక వారాహి అమ్మవారి పూజా కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించి, తీర్థప్రసాదాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అడపా దుర్గా, మియాపూర్ డివిజన్ యువ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్, వెంకటేశ్వర్లు, బాబ్జీ, శరత్,వంశీ, ప్రవీణ్, వాసు, రత్నాచారి, వినోద్ తదితర నాయకులు, భక్తులు, స్థానిక నివాసితులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కు శుభాకాంక్షలు తెలియజేసిన కోసనం అశోక్ కుమార్ యాదవ్

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం కి చెందిన ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు కోసనం అశోక్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశం కి మంత్రి హోదా వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యేకి శాలువా తో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే నాయకుల్ని రేవంత్ రెడ్డి మరియు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుచిది, ప్రతినిత్యం ప్రజా సేవలో ఉండే ఏకైక నాయకుడు వీరేశం అని అన్నారు




## బొడ్రాయికి జలాభిషేకం పాల్గొన్న సర్పంచ్ కాటం వెంకటేశం



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో వర్షాలు కురవాలని గ్రామంలో బొడ్రాయికి జలాభిషేకం ప్రారంభించిన సర్పంచ్ కాటం వెంకటేశం ఉప సర్పంచ్ ఓర్సు సైదులు, వార్డు సభ్యులు కురు యాదయ్య తెలుసూరి నరసింహ సాగర్ల నాగరాజు ఏర్పుల మల్లేశ్వరి వెంకన్న జిల్లా ప్రశాంత్ మర్రి హరీష్ రెడ్డి, ఆనగంటి నరేష్ నీలకంఠం లింగస్వామి, ఏర్పుల నరసింహ ఆవుల రాము చేకూరి గణేష్ గంటల రవీందర్ రెడ్డి గ్రామ ప్రముఖులు భక్తులు పాల్గొన్నారు

## రవీంద్రసూరికి సినారె సాహితీ పురస్కారం

**కూకట్ పల్లి, జూలై 23 (క్రైమ్ మిర్రర్) :** సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన కవి, సినీ దర్శకుడు నామాల రవీంద్రసూరికి 2026 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక పద్మభూషణ్, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా. సి. నారాయణరెడ్డి (సినారె) స్మారక సాహితీ పురస్కారం ప్రకటించారు. మహాకవి సినారె 95వ జయంతిని పురస్కరించుకొని సినారె కళాపీఠం, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఆగస్టు 2న హైదరాబాద్‌లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం సెమినార్ హాల్‌లో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములు వెల్లడించారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి తనను ఎంపిక చేసిన ఎంపిక కమిటీ సభ్యులకు, సినారె కళాపీఠం అధ్యక్షులు మల్లెకేడి రాములు కి రవీంద్రసూరి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవాన్ని తన వ్యక్తిగత విజయంగా కాకుండా సాహిత్యానికి లభించిన గుర్తింపుగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



## వారాహి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగింపు



**వనపర్తి జులై 13 క్రైమ్ మిర్రర్ :** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు ఆద్యంతం భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. ఉత్సవాల చివరి రోజైన తొమ్మిదో రోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోగా, అమ్మవారికి వేద మంత్రోచ్చారణల నడుమ విశేష అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి అనుగ్రహం కోసం వారాహి హోమం వైభవంగా నిర్వహించగా, హోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూర్ణాహుతి సమర్పించారు. హోమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మహిళా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించి అమ్మవారిని ప్రార్థించారు. అలాగే సంప్రదాయబద్ధంగా ఒడి బియ్యం సమర్పణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించి కుటుంబాల ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖశాంతులు కలగాలని వేడుకున్నారు. సాయంత్రం. ఊరేగింపులో మహిళలు భక్తులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన వారాహి నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజూ విశేష పూజలు, అలంకరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల విశేష ఆదరణతో విజయవంతంగా జరిగాయని తెలిపారు. చివరి రోజు నిర్వహించిన కార్యక్రమాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడం విశేషంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మహిళలు. భక్తులు పాల్గొన్నారు

## రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలకు ఎన్నికైన విద్యార్థిని కోస్గి హరిప్రియ

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలంలోని చెల్లాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న మూడవ తరగది విద్యార్థిని కోస్గి హరిప్రియ కరీంనగర్ క్రీడా పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో ఎన్నిక అయినా సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుప్పలి ఆనంద్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ కోస్గి సంతోష,ఉపాధ్యాయులు శ్రీనివాసులు, దస్తయ్య విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడాలకు కూడ ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు





## ఎస్సైనీ సన్మానించిన వార్డు సభ్యులు

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** నూతనంగా మునుగోడు ఎస్సై గా బాధ్యతలు చేపట్టిన ఎస్సై శోభన్ బాబు ను గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు సాధారణంగా కలిసి శాలువాతో సన్మానించారు..పలు సమస్యలపై చర్చించారు.

## కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ నూతన సీఐ స్వామి గౌడ్ కి అభినందనల వెల్లువ

### శాలువాతో సత్కరించిన రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి



**కూకట్ పల్లి, జూలై 23 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ నూతన సిఐ డి స్వామి గౌడ్ ని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేసి స్వీట్లు పూల మొక్కను అందజేసి అభినందనలు తెలిపారు. అదేవిధంగా వివేకానంద నగర్ సెక్టార్ ఎస్సై నర్మదా మేడం ని చంద్రశేఖర్ ఎస్ఐ ని కలిసి శాల తో సన్మానం చేశారు. అనంతరం సిఐ డి స్వామి గౌడ్ మాట్లాడుతూ కూకట్ పల్లి ప్రాంతంలో బోనాలు వినాయక చవితి ఉత్సవాలు భారీగా జరుగుతాయి కావున ప్రజలకు భక్తులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రజలకు సహకరిస్తామని తెలిపారు. పురంధర్ రెడ్డి మాట్లాడుతూ కూకట్ పల్లి పోలీసు అధికారులు ఎల్లప్పుడూ శాంతియుతంగా పండుగలు జరుపుకోవడానికి ప్రజలకు ఎల్లవేళలు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కారానికి పోలీసు అధికారులు ఎల్లప్పుడు సహకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జి ప్రసాద్, కెవి రావు, సూర్యనారాయణ, నాని, అఖిల్, యశ్వంత్ తదితరులు కలిసి సిఐ కి, ఎస్సై కి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఓటు ఎంతో విలువైంది..ఎస్ఐఆర్ తప్పక చేసుకోండి

### కాంగ్రెస్ నేత మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి పిలుపు

**బాలానగర్, జూలై 23 (క్రైమ్ మిర్రర్) :** ప్రతీ ఒక్కరి ఓటు ఎంతో విలువైంది, ఏ ఒక్కరి ఓటు ఎస్ఐఆర్ ప్రక్రియ నుండి పక్కకు జరగకూడదని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం బాలానగర్ డివిజన్ లోని శ్రీశ్రీ నగర్ లో ఎస్ఐఆర్ ఓటరు ప్రక్రియ ఏవిధంగా జరుగుతుందో పరిశీలించారు. జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటరు ప్రక్రియలో అక్కడకు విచ్చేసిన ఓటర్లతో ఆయన మాట్లాడారు. ఓటర్ల చేతిలో ఉన్న ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాన్ని ఆయన పరిశీలించారు. కొన్ని ఎస్ఐఆర్ ఓటరు దరఖాస్తులో కొన్ని తప్పులు జరుగుతున్నాయని, ఎస్ఐఆర్ ఓటరు దరఖాస్తును నింపడంలో బూత్ లెవెల్ అధికారులు తప్పనిసరిగా కొంత మేరకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ బూత్ నెంబర్



30 బి.ఎల్.ఎ.బందిగా బాల నరసింహ, పోలింగ్ బూత్ నెంబర్ 31 బి.ఎల్.ఎ.మాదరి శ్రీనివాస్, ముప్పూరి బాలరాజు, ఖాదర్, రుక్మొద్దీన్, అలీం భాయ్, గాలి నరేష్, జమీర్, ఖల్నాయక్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# నారగుట్టపై మైనింగ్

## క్రషర్ ఏర్పాటును ప్రతిఘటించండి

## జనావాసాల మధ్య క్రషర్ ప్రతిపాదన ఉపసంహరించకుంటే ప్రజా పోరు తప్పదు

## ఈనెల 28న ప్రజాభిప్రాయ సేకరణలో ఐక్యత చాటండి

## బిక్రషర్ వల్ల ప్రజా జీవితాలు వ్యవసాయం నాశనమవుతాయి

## సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 23(క్రైమ్ మిర్రర్):** భువనగిరి పట్టణంలోని సుందరయ్య భవన్ లో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నారగుట్టపై స్టోన్ క్రషర్ (మైనింగ్) ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వవద్దని పల్లెర్ల అంజయ్య అధ్యక్షతనరౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ రౌండ్ సేపు సమావేశంలో వివిధ గ్రామాల ప్రముఖులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, రైతులు వృత్తిదారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ మాట్లాడుతూ భువనగిరి మండలంలోని గౌస్ నగర్, తుక్కాపూర్, ఎర్రంబల్లి, నమాత్ పల్లి, గ్రామాల మధ్యన ఉన్న నారగుట్టపై మైనింగ్ క్రషర్ ఏర్పాటును ప్రాతికటించాలని , జనావాసాల మధ్య క్రషర్ ప్రతిపాదన ఉపసంహరించకుంటే ప్రజా పోరు తప్పదని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని వెంటనే దీనిని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .ఈనెల 28న జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో ముక్తకంఠంతో ప్రజలు రైతులు కార్మికులు సమస్త ప్రజా సంఘాలు ఐక్యత చాటి రద్దు అయ్యే వరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. భువనగిరి మండలంలోని సర్వేనెంబర్ 119 , 139 లో ప్రభుత్వానికి చెందిన నారగుట్టపై 50 ఎకరాల విస్తీర్ణంలో మెసర్స్ ఆర్కె స్టోన్స్ ఇండస్ట్రీస్ కు మైనింగ్ కు అనుమతి ప్రతిపాదనలను తక్షణం రద్దు చేయాలని, ఈనెల 28 జరిగే ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేయాలని పేర్కొన్నారు. ప్రకృతి వారసత్వానికి, జీవ వైవిధ్యానికి భూగర్భ జలాల సంరక్షణకు, జంతువులకు, పక్షులకు, ఆవాసాలకు ప్రతీకలైన నారగుట్టలను మైనింగ్ అప్పగించడం వల్ల ప్రజారోగ్యం, పర్యావరణం ˇమతుల్యత దెబ్బ తింటుందని చుట్టూ పది కిలోమీటర్ల పరిధిలో ప్రజారోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని, రైతుల వ్యవసాయం దెబ్బతిని, భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని, ఈ గుట్టపై ప్రకృతి ఆయుర్వేద వనమూలికలు, మన సంపదకు ప్రమాదం వాటిల్లో పరిస్థితులు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్త నాగసేనారెడ్డి మాట్లాడుతూ. ప్రకృతిని కాపాడాలని పర్యావరణాన్ని పరిరక్షించకపోతే భవిష్యత్ తరాలు మనని క్షమించవని చెట్లు, గుట్టలను రక్షించుకో రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరి పైన ఉన్నదని ప్రకృతిని విధ్వంసం చేయడం ద్వారా మానవ మనుగడకే ప్రమాదంగా పరిణమిస్తున్నాయని పేర్కొన్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటలు బాలరాజు గౌడ్ మాట్లాడుతూ నారగుట్ట పరిసర గ్రామాల ప్రజలకు జీవనాధారంగా ఉందని, అనేక జీవవైవిధ్య పక్షి జాతులు, పండ్లు, సీతాఫలాలు, వన్యప్రాణులు వృత్తిదారులకు జీవన విధానంలో మమేకమైన సంపదని పేర్కొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో జీడిమెట్ల రవీందర్ పర్యావరణ ఉద్యమకారులు

**నమాత్ పల్లి సర్పంచ్ అతికం అరుణా లక్ష్మీనారాయణ గౌడ్:** తుక్కాపురం మాజీ సర్పంచ్ నోముల మహేందర్ రెడ్డి, ప్రముఖ సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య, ఎం సత్యనారాయణ వికలాంగుల సంఘం అధ్యక్షులు , బానోతు భాస్కర్ నాయక్, జి శ్రీనివాస్ చార్యులు , మాజీ ఎంపిటిసి నల్ల మాస సత్యనారాయణ, సిపిఐ నాయకులు దాసరి లక్ష్మయ్య,బత్తిని కుమార్ జిట్టా అంజిరెడ్డి భూషబోయిన నరసింహ ఏదునూరి మల్లేశం, గౌస్ నగర్ మాజీ ఉపసర్పంచ్ పాక వెంకటేశంఏడు మేకల మహేష్,వినోద్, వి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు



# నూతన వనపర్తి జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులుకు గణ సన్మానం

## సన్మానించిన మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**వనపర్తి జులై 23 క్రైమ్ మిర్రర్:** వనపర్తి నూతన జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన కిచన్నగారి వెంకటేశ్వర్ రెడ్డిని పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి, జిల్లాలో వరి, ధాన్యం కొనుగోలు, మిల్లింగ్ ప్రక్రియ మెరుగుదలకు అసోసియేషన్ కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని రైతులు, మిల్లర్లకు మేలు చేసేలా పనిచేయాలని ఆకాంక్షించారు.నూతన అధ్యక్షులు కీచన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులందరి సహకారంతో జిల్లాలో రైస్ మిల్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడు, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, బుర్రమోని రాములు యాదవ్, పబ్బా శేఖర్ గౌడ్, మాజీ డైరెక్టర్ రాములు, కమలాకర్ రెడ్డి రంగన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు రూ.72 లక్షల చెక్కుల పంపిణీ చేసిన పరిగి ఎమ్మెల్యే టిఆర్ఆర్



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:**కుల్కచర్ల మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 16 మంది రైతులకు సుమారు రూ.72 లక్షల విలువైన ఎల్టి లోన్ చెక్కులను పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (సర్) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, సహకార సంఘాల ద్వారా అందిస్తున్న రుణాలు రైతులకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటునిస్తాయని అన్నారు.రైతులు ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బొలుసని భీంరెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయకులు, కార్యకర్తలు,కమిటీ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# శివరాంపల్లిలో నూతన సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



గండిపేట(క్రైమ్ మిర్రర్): శివరాంపల్లి డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి హరిజన్‌బస్తీ క్రాస్ రోడ్డు వరకు చేపట్టిన నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు నిర్మాణ పనుల నాణ్యత, రోడ్డు వెడల్పు, పనుల పురోగతి తదితర అంశాలను సంబంధిత అధికారులతో సమీక్షించారు. ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ రహదారి పూర్తయితే శివరాంపల్లి డీఎంహెచ్ఓ కార్యాలయం పరిసర ప్రాంతాలతో పాటు హరిజన్‌బస్తీ ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని నాయకులు తెలిపారు. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రభాకర్ రెడ్డి, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఏ ఈ, సంబంధిత శాఖ అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.



# శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తాం

## పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి

### దేవాలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే టిఆర్ఆర్

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని పరిగి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ టి రామ్మోహన్ రెడ్డి సూచించారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం బండవేల్కిచర్ల గ్రామంలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయ చైర్మన్‌గా మైపాల్ రెడ్డి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పాంబండ ఆలయ కమిటీ చైర్మన్ మైపాల్ రెడ్డి పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి అభినందిస్తూ వారికి శు భాకాంక్షలు తెలియజేశారు.దేవాలయ అభివృద్ధికి అంకితభావంతో సేవలందించాలని ఆకాంక్షించారు.ఎమ్మెల్యే పాంబండ రామలింగేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.అనంతరం దేవాలయ చైర్మన్ మైపాల్ రెడ్డి పాలకవర్గ సభ్యులు గ్రామ పెద్దలు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించి తమ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆధ్యాత్మికత మనిషికి మానసిక ప్రశాంతతను కలిగిస్తుందని అన్నారు. దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహాయ సహకారాలు అందిస్తూ, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించాలని అన్నారు.శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే పరిగి నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు.కుల్కచర్ల మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ అభివృద్ధికి కూడా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కుల్కచర్ల పిఏసిఎస్ చైర్మన్ బొలుసని భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, చౌడపూర్ మండల అధ్యక్షులు చంద్రశేఖర్, బండవెలికిచర్ల గ్రామ సర్పంచ్ సీనయ్య, ప్రజాప్రతినిధులు,స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌లో బస్సు సౌకర్యాలు కల్పించాలని ఆర్టీసీ డిపో మేనేజ్‌మెంట్‌కు సీపీఎం వినతి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు డిపో మేనేజ్‌మెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమం సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యుడు చుక్క మోహన్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజేంద్రనగర్ నుంచి మొయినాబాద్, హిమాయత్‌నగర్ ప్రాంతాలకు ప్రతిరోజూ కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ కూలీలు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో ప్రయాణిస్తున్నారని తెలిపారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అరంఘర్ నుంచి మొయినాబాద్ వైపు కొత్త బస్సు సర్వీసును ప్రారంభించాలని వారు డిపో మేనేజ్‌మెంట్‌ను కోరారు. అలాగే 95పీ బస్సు సర్వీసును శివరాంపల్లి--274 ప్రాంతం నుంచి పాతబస్తీ మీదుగా కోటి వరకు నడిపేలా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మార్గంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, రోజువారీ కార్మికులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రజల రవాణా అవసరాలను గుర్తించి వీలైనంత త్వరగా కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించి, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని రాజేంద్రనగర్ బస్ డిపో మేనేజ్‌మెంట్‌ను సీపీఎం నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎన్. జంగయ్య, ఎం. మల్లేష్, శ్రీనివాస మూర్తి, జగదీష్, మహేష్, నాగరాజు, లింగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముంబైలో ప్రతికూల వాతావరణం శంషాబాద్‌కు మళ్లించిన పలు విమానాలు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ముంబై విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో పలు విమానాలను హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంకు అధికారులు దారి మళ్లించారు. సూరత్, వారణాసి, ఢిల్లీతో పాటు ఇతర ప్రాంతాల నుంచి ముంబైకి వెళ్తున్న పలువిమానాలు వాతావరణం అనుకూలించకపోవడంతో భద్రతా కారణాల దృష్ట్యా శంషాబాద్ విమానాశ్రయంలో తాత్కాలికంగా ల్యాండ్ అయ్యాయి. వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన అనంతరం ఆయా విమానాలను తిరిగి ముంబైకి పంపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రయాణికులు విమానాల తాజా సమాచారం కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని విమానాశ్రయ అధికారులు సూచించారు.

# మహిళలకు స్వీయ రక్షణపై అవగాహన

## చౌటుప్పల్ సిఐ జీ.మన్మథ కుమార్



**యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో, జూలై 23(క్రైమ్ మిర్రర్):** మహిళలు అత్యవసర పరిస్థితులలో ప్రమాదాలు ఎదురైనప్పుడు తప్పకుండా పోలీసుల సహాయం పొందాలని చౌటుప్పల్ సిఐ జీ.మన్మథ కుమార్ తెలిపారు. గురువారం ధర్మోజీగూడెం గ్రామ పరిధిలోని సైనర్జీ కంపెనీ ప్రాంగణంలో మహిళల భద్రత, హక్కులు, స్వీయ రక్షణపై అవగాహన కల్పించేందుకు ఉమెన్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాంను సీఐ మన్మథ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ్ కుమార్ హాజరై మహిళలు అప్రమత్తంగా ఉండడం, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహాయం పొందే విధానం, మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు, సైబర్ నేరాల నుండి రక్షణ, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు భద్రతా సూచనలు తెలుసుకొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు. మహిళల భద్రత కోసం అవగాహన, ఆత్మవిశ్వాసం, సమయానికి పోలీసులను సంప్రదించడం ఎంతో ముఖ్యమని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేనిఫెస్టో హామీలను వెంటనే అమలు చేయాలి

## మల్లోజుల శ్రీనివాసచారి



హైదరాబాద్(క్రైమ్ మిర్రర్): తెలంగాణ ఉద్యమకారుల ఆశలన్నీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనే ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను, ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని తెలంగాణ అమరవీరుల ఆశయాల సాధన సమితి రాష్ట్ర కోశాధికారి మల్లోజుల శ్రీనివాసచారి డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆరు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం, వేలాది మంది ఉద్యమకారుల కృషి, అమరవీరుల త్యాగాల ఫలితంగా ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు, ఇచ్చిన హామీలు ఇప్పటికీ పూర్తి స్థాయిలో అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుల ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం కే.కే. కమిటీని ఏర్పాటు చేసి, చర్చలు జరపడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్న శ్రీనివాసచారి, కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఉద్యమకారులకు న్యాయం చేస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడికి, కేసులతో సంబంధం లేకుండా అధికారిక గుర్తింపు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన బెల్లి లలిత, మారోజు వీరన్న, కోనపురి సాంబశివుడు, రాములు తదితర అమరవీరుల కుటుంబాలకు, ఇప్పటి వరకు తగిన న్యాయం జరగలేదని అన్నారు. కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఆ కుటుంబాలను ఆదుకుని, వారికి ప్రత్యేక సంక్షేమ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ప్రతి ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలం, గృహ నిర్మాణానికి ప్రభుత్వ ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులను స్వరాష్ట్ర పోరాట యోధులుగా గుర్తించి, నెలకు 25 వేల గౌరవ పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమ నాయకులపై నమోదైన కేసులను ఎత్తివేసి, ఉద్యమాలకు సంబంధించిన కేసుల్లో జైలులో ఉన్న నాయకులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమకారుల పిల్లలకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, రైలు, బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, మహిళా ఉద్యమకారులకు ప్రభుత్వ శాఖల్లో ప్రత్యేక ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో మరో ఉద్యమానికి దారితీసే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని మల్లోజుల శ్రీనివాసచారి హెచ్చరించారు.



# శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు ఈ-మెయిల్

## అప్రమత్తమైన భద్రతా బలగాలు

గండిపేట(క్రైమ్ మిర్రర్): శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు ఈ-మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న ఓ విమానంలో బాంబు అమర్చినట్లు, అది ఎప్పుడైనా పేలే అవకాశం ఉందంటూ గుర్తుతెలియని వ్యక్తి ఈ-మెయిల్ పంపినట్లు సమాచారం. ఈ మెయిల్ అందిన వెంటనే విమానాశ్రయ భద్రతా సిబ్బంది, సీఐఎస్ఎఫ్, పోలీసు అధికారులు అత్యవసరంగా తనిఖీలు ప్రారంభించారు. అయితే బెదిరింపులో ఏ విమానాన్ని లక్ష్యంగా చేసుకున్నారనే విషయం స్పష్టంగా పేర్కొనకపోవడంతో అధికారులు అన్ని కోణాల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ విమానాలు, టెర్మినల్ పరిసరాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తిని గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

# విద్యార్థుల తలలు పగలగొట్టడమే బిజెపి లక్ష్యమా

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

### ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్

### శంషాబాద్ లో ఎస్ఎఫ్ఐ - ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ.!

### భగత్ సింగ్ వారసులుగా ప్రాణాలు పోయినా పోరాడుతాం



గండిపేట(క్రైమ్ మిర్రర్): దేశ రాజధానిలో జంతర్ మంతర్ వద్ద నీట్ -యూజీ పరీక్షల అక్రమాలపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ మరియు విద్యార్థి సంఘాల విద్యార్థులు ఆందోళన చేస్తుంటే ఆ విద్యార్థులపై బిజెపి ప్రభుత్వం ధమనకాండ ప్రయోగించి లాఠీ ఛార్జ్ చేసి విద్యార్థుల తలలు పగలగొట్టడం బాష్ప వాయువు ప్రయోగించి విద్యార్థులను అణచివేయడం దేనికి నిదర్శనమని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా జిల్లా అధ్యక్షుడు కేవై ప్రణయ్, ఎన్ఎస్‌యుఐ నాయకులు జిల్లా ఆనంద్ కేంద్ర ప్రభుత్వాలపై మండిపడ్డారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీలు ప్రయోగించి విద్యార్థుల తలలు పగలగొట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టిన ఎంతమంది విద్యార్థులపై లాఠీచార్జి చేసిన విద్యార్థి ఉద్యమం ఆగదని కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు నీట్ -యూజీ ప్రశ్న పత్రాల లీకేజీలో బాధ్యత వహిస్తూ వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఎన్‌టిఎ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 24న జరిగే రాష్ట్రవ్యాప్త బందును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసాద్, తనిష్క్, రుద్రాక్ష, శ్రీ హర్ష, నిహారిక, సాయి మనీష్, శివ రాథోడ్, ఎన్ఎస్‌యుఐ నాయకులు కర్ణాకర్,సుమన్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్ పోసి మర్రిగూడలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

## ప్రధాని నివాసాన్ని ముట్టడించే యత్నాన్ని ఖండిస్తూ నిరసన

## కాంగ్రెస్ చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం..బీజేపీ నాయకులు



మర్రిగూడ(క్రైమ్ మిర్రర్): దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేపట్టిన చర్యలను నిరసిస్తూ, మర్రిగూడ మండలంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో, గురువారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను పెట్రోల్ పోసి దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు యాస అమరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పాత్లావత్ రాజేందర్ నాయక్, జిల్లా నాయకుడు యాస అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. రాజకీయ కుట్రలో భాగంగా దేశ ప్రధాన మంత్రి నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని, కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు విమర్శించారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ రాజ్యాంగబద్ధమైన పదవులకు గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందన్నారు. ఇలాంటి చర్యలు దేశ రాజకీయ వ్యవస్థకు, ప్రజాస్వామ్య సంప్రదాయాలకు మంచివి కావని పేర్కొంటూ, భారతీయ జనతా పార్టీ తరపున వాటిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం పేరుతో రాజ్యాంగబద్ధ సంస్థలు, అత్యున్నత పదవులను లక్ష్యంగా చేసుకోవడం సమంజసం కాదని అభిప్రాయపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు రవీందర్ రెడ్డి, వేనేపల్లి శ్రీనివాసరావు, గ్యార యాదగిరి, మామిడి పరుశురాం, కేసరి ముత్యం రెడ్డి, మండల కార్యదర్శి శోభన్ బాబు, వివిఎస్. వెంకటేష్ తో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# జెడ్పీహెచ్ఎస్ హైదర్‌షాకోట్‌లో ముగిసిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సమగ్ర శిక్షణ

గండిపేట(క్రైమ్ మిర్రర్): జెడ్పీహెచ్ఎస్ హైదర్‌షాకోట్ పాఠశాలలో నిర్వహించిన తొలి విడత 50 శాతం ఎస్‌జీటీ ఉపాధ్యాయుల మూడు రోజుల ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ విజయవంతంగా ముగిసింది. శిక్షణ కార్యక్రమం చివరి రోజున గండిపేట మండల విద్యాధికారి వెంకటేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శిక్షణలో నేర్చుకున్న బోధనా విధానాలు, వినూత్న పద్ధతులను తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ సునీల్ కుమార్, డీఆర్‌పీలు పాల్గొని ఉపాధ్యాయులకు పలు విద్యా అంశాలపై మార్గనిర్దేశం చేశారు. గండిపేట మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 50 శాతం ఎస్‌జీటీ ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణ ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల పెంపునకు దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# నానక్‌రామ్‌గూడలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అనుమానాస్పద మృతి

## కేసు నమోదు చేసిన నార్సింగి పోలీసులు



గండిపేట(క్రైమ్ మిర్రర్): నానక్‌రామ్‌గూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల సమాచారం ప్రకారం మృతుడు మబ్బు విష్ణువర్ధన్ రెడ్డి(27) జేపీ మోర్గాన్ చేజ్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. జూలై 22న విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్న అనంతరం తన గదిలోకి వెళ్లి విశ్రాంతి తీసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తెల్లవారుజామున అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆయన అపస్మారక స్థితిలో కనిపించగా, వెంటనే పరిశీలించిన కుటుంబ సభ్యులు అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలనలు నిర్వహించారు. నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదికతో పాటు దర్యాప్తు అనంతరం మరణానికి గల ఖచ్చితమైన కారణాలు వెల్లడవుతాయని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# మాదాపూర్‌లో అక్రమంగా దిగుమతి సిగరెట్ల విక్రయం......

## పాన్‌షాప్ యజమాని అరెస్ట్......

మాదాపూర్ క్రైమ్ మిర్రర్ : మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో ఎస్-స్మార్ట్ ఎదురుగా ఉన్న పాన్.కామ్ పాన్‌షాప్‌లో అక్రమంగా దిగుమతి సిగరెట్లను విక్రయిస్తున్న పాన్‌షాప్ యజమాని ఎం.డి. నిజామొద్దీన్ (58)ను పోలీసులు అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ కె. రాఘవేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించగా, నిందితుడు తప్పించుకునే ప్రయత్నం చేసినప్పటికీ అదుపులోకి తీసుకున్నారు. దుకాణంలో తనిఖీ చేయగా గరం, ఎస్సే స్పెషల్ గోల్డ్, బ్లాక్, డన్‌హిల్, పారిస్, ఎస్సే బ్లాక్, విన్, మాండ్, ఎస్సే లైట్ బ్రాండ్‌లకు చెందిన మొత్తం 63 ప్యాకెట్ల దిగుమతి సిగరెట్లు, 18 ఓసీబీ పేపర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సులభంగా అధిక లాభాలు వస్తాయనే ఉద్దేశంతో ధర్మేందర్ అనే వ్యక్తి నుంచి దిగుమతి సిగరెట్లను కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు నిందితుడు విచారణలో అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వస్తువులను సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు దర్యాప్తు అధికారి బాలరాం ఎస్ఐ తెలిపారు.

# ఆదర్శ కాలనీలో మహిళా భవన నిర్మాణానికి మరో ముందడుగు

## స్లాబ్ పనుల సందర్భంగా ప్రత్యేక పూజలు..

## మహిళా సాధికారతకు భవనం దోహదం చేస్తుందని ఆశాభావం

గండిపేట(క్రైమ్ మిర్రర్): మైలర్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆదర్శ కాలనీలో నిర్మాణంలో ఉన్న మహిళా భవనానికి స్లాబ్ వేస్తున్న సందర్భంగా కాలనీ మహిళా సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భవన నిర్మాణం విజయవంతంగా పూర్తికావాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య ప్రతినిధులు మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, సాధికారత దిశగా ఈ మహిళా భవనం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మహిళల సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం శాశ్వత వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు, వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి ఈ భవనం ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళల కోసం ప్రత్యేకంగా నిర్మిస్తున్న ఈ భవనం పూర్తయిన అనంతరం కాలనీలోని మహిళలకు అన్ని విధాలుగా ఉపయోగకరంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మైలార్ దేవ్ పల్లి



డివిజన్ యువజన అధ్యక్షులు అక్కెం రాఘవేందర్ యాదవ్, గుమ్మడి మైసి రెడ్డి, మహిళా సమాఖ్య ప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు, కాలనీవాసులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని భవన నిర్మాణ పనులను పరిశీలించారు. మహిళా భవనం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# తెలంగాణ సంస్కతి, సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక

## రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్చార్జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి



గండిపేట(క్రైమ్ మిర్రర్): తెలంగాణ సంస్కతి, సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్చార్జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రగతి కాలనీలో బోనాల పండుగ ఉత్సవాలలో భాగంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల ఉత్సవాల పండుగ సంబంధించిన ఏర్పాట్లు నిర్వహించాలని తోకల శ్రీనివాస్‌రెడ్డిని కలిసి దేవాలయ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు ఫోన్ చేసి దేవాలయాల వద్ద అభివద్ధి పనులను ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. దేవాలయాలనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేసి బోనాల పండుగకు దేవాలయాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు కష్ణయాదవ్, రావుల భాస్కర్, ప్రతాప్‌రెడ్డి, దాసు, చిన్న, అక్కెం జంగయ్యయాదవ్, సురేష్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు న్యాయం కోసం కాంగ్రెస్ శాంతియుత ధర్నా

## రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ నెక్నాంపూర్--మణికొండ కాంగ్రెస్ నిరసన



గండిపేట(క్రైమ్ మిర్రర్): విద్యార్థులకు న్యాయం చేయాలని, పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను కాపాడాలని డిమాండ్ చేస్తూ నెక్నాంపూర్, మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఈఐపిఎల్ కార్నర్‌స్టోన్ జంక్షన్ వద్ద శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు నివాళు లర్పించడంతో పాటు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండించారు. ధర్నాలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో 152కు పైగా పరీక్షా పేపర్ లీకులు జరిగాయని ప్రతిపక్షం ఆరోపిస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని, పరీక్షా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నమ్మకం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించిన నాయకులు, పేపర్ లీకులకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు దేశవ్యాప్తంగా పరీక్షల భద్రతకు శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రస్తావిస్తూ వారి తరఫున గొంతు వినిపిస్తున్న ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. ప్రజల గొంతును అణచివేయాలనే ప్రయత్నాలను ప్రజాస్వామ్యవాదులు సహించరని పేర్కొన్నారు. విద్య, ఉపాధి, యువత భవిష్యత్తు విషయంలో కాంగ్రెస్ పార్టీ రాజీ పడదని, విద్యార్థులకు న్యాయం జరిగే వరకు, పరీక్షా వ్యవస్థలో సంస్కరణలు అమలు అయ్యే వరకు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు. ధర్నా కార్యక్రమంలో నెక్నాంపూర్ డివిజన్ అధ్యక్షులు మెరుగు జితేందర్, కిరణ్ కుమార్, లక్ష్మీనారాయణ, తాజా ఒద్దీన్, పురుషోత్తం, శరత్, కస్తూరి సతీష్, కస్తూరి శ్రావణ్, అఖిల్, ఎర్రోళ్ల రాజు, కుమార్, షేక్ హాజీ, ఇందిర, సావిత్రి, సంగం ప్రవీణ్, గణేష్ ,శివ,ఇమ్రాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా చిట్యాలలో మోడీ శవయాత్ర

చిట్యాల క్రైమ్ మిర్రర్: చిట్యాల మండల పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ శవయాత్ర నిర్వహించారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వాన్ని నిర్వహిస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా చిట్యాలలో ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నల్గొండ జిల్లా అధికార ప్రతినిధి పోకల దేవదాస్,మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్ మాట్లాడుతూ నీట్ లీకేజీతో విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడుతోందని, రాహుల్ గాంధీపై పెట్టిన అక్రమ కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీ లక్ష్మీ సైదులు, కౌన్సిలర్లు కుక్కల లతా రాజేష్, మునగాల సందీపా రామిరెడ్డి, కోనేటి ఎల్లయ్య, గాలి లింగమ్మ యాదయ్య, కో-ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్, సత్తయ్య, సత్తయ్య దేవాలయ చైర్మన్ మారగొనిఆంజనేయులు, మండల పార్టీ అధ్యక్షులు జడల మల్లయ యాదవ్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఎద్దులపురి కృష్ణ, నాయకులు కట్టా ఆశయ్య, ఆవుల సుందర్, కొసనం అశోక్ యాదవ్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పిశాడు భీష్మారెడ్డి, కో ఆపరేషన్ నెంబర్ బెల్లి సత్తయ్య, రుద్రవరం లింగస్వామి, మెట్టు మనోహర్, దాసరి నరసింహ, కళ్లెం నరసింహ,సల్ల రాజు, శ్రీకాంత్ చారి, అమ్మ రోజు మదన్ , దాసరి నరసింహ,తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ అంటావ్...దేశ్ కో బచావో

### ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపితే లాఠీచార్జి చేస్తారా?

### రాహుల్ గాంధీ అరెస్ట్ దుర్మార్గం

### ఇంతటి అరాచకం ఎన్నడూ చూడలేదు

### నవాబ్ పేట్ మండల అధ్యక్షులు రావుగారి వెంకట్ రెడ్డి

### నవాబ్ పేట్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన



క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి : ప్రజాస్వామ్యబద్ధంగా విద్యార్థుల తరఫున నిరసన తెలిపిన ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని అరెస్ట్ చేయడం కేంద్ర ప్రభుత్వ అరాచక పాలనకు నిదర్శనమని నవాబ్ పేట్ మండల అధ్యక్షులు రావుగారి వెంకట్ రెడ్డి అన్నారు.కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకా గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతల అరెస్ట్‌కు నిరసనగా వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండల పార్టీ అధ్యక్షులు రావుగారి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల,సర్పంచులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి రోడ్డు పై బైటయించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష లీక్, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తూ నిరసన తెలిపితే కేంద్రం పైశాచికంగా వ్యవహరించిన తీరు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.రౌడీలు, హంతకులను తీసుకెళ్లినట్టుగా పోలీసులు రాహుల్‌గాంధీని అరెస్ట్‌చేసిన తీరు దేశవ్యాప్తంగా ఉన్న యువతను కదిలించిందన్నారు. రాహుల్గాంధీ,ప్రియాంకా గాంధీ ఏం తప్పు చేశారని అరెస్ట్ చేస్తారని ప్రశ్నించారు.బ్రిటిష్‌కాలం నాటి నిర్బంధం,నియంతృత్వం మళ్లీ మోడీ పాలనలో కనిపిస్తోందని విమర్శించారు.నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటనకు కారణమై వేల మంది విద్యార్థులకు అన్యాయం చేసిన సంబంధిత మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ పోరాటంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి,ఏఎంసీ చైర్మన్ రాథోడ్ గీత సింగ్,సర్పంచుల సంఘం అధ్యక్షులు బల్వంత్ రెడ్డి,సర్పంచులు కిష్టయ్య, శ్రీనివాస్,శేఖర్,జగన్ రెడ్డి,ఏఎంసీ డైరెక్టర్ నర్సింహా రెడ్డి,రాజశేఖర్ రెడ్డి,లింగం, సాయి,నాయకులు మల్లారెడ్డి,నాగిరెడ్డి, ప్రభాకర్,రఫీ, పరమేశ్వర్ చారి,దేవయ్య,బుచ్చయ్య, ప్రకాష్, మాణిక్యం,రవీందర్, ప్రభు,నాగరాజు ,బాలరాజు, నర్సిములు,అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మద్దతుగా నేడు ఇందిరా పార్క్ వద్ద బీఆర్ఎస్వీ భారీ నిరసన

### కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్



గండిపేట(క్రైమ్ మిర్రర్): ఢిల్లీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలకు మద్దతుగా, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నేడు (జూలై 24) ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ సమీపంలో భారీ నిరసన కార్యక్రమం కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ నిర్వహించను న్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు చేపడుతున్న ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్), మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డితో పాటు పలువురు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కేంద్ర విద్యా విధానాలపై నిరసన వ్యక్తం చేస్తూ, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్వీ ప్రతినిధులు, యువ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కాటేదాన్ డివిజన్ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్ పిలుపునిచ్చారు.

## శీలం తిరుపతి రెడ్డి ఫిర్యాదులపై గగన్‌పహాడ్ చెరువుల పరిశీలన

### ప్రెస్టేజ్ పెద్ద చెరువు సహా నాలుగు చెరువులను పరిశీలించిన హైడ్రా అధికారులు



గండిపేట(క్రైమ్ మిర్రర్): బీఆర్ఎస్ నాయకుడు శీలం తిరుపతి రెడ్డి చేసిన ఫిర్యాదుల నేపథ్యంలో గగన్‌పహాడ్ పరిధిలోని ప్రెస్టేజ్ పెద్ద చెరువు, మామిడికుంట చెరువు, అప్ప చెరువు, బ్రాహ్మణ చెరువులను హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువుల ప్రస్తుత పరిస్థితి, చెరువు సరిహద్దులు, ఆక్రమణల పరిస్థితి, నీటి ప్రవాహ మార్గాలు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. పరిశీలన అనంతరం సమగ్ర నివేదికను సిద్ధం చేసి హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్కు సమర్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు. చెరువుల పరిరక్షణకు అవసరమైన చర్యలు నివేదిక ఆధారంగా తీసుకుంటామని వారు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు శీలం తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, గగన్‌పహాడ్ పరిధిలోని చెరువులు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయని, దీనివల్ల సహజ జలవనరులు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఫిర్యాదుల మేరకు హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టడం స్వాగతించదగ్గ విషయమని అన్నారు. చెరువుల పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి ఆక్రమణలను గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. చెరువులను పరిరక్షించడం వల్ల భూగర్భ జలాలు పెరగడంతో పాటు భవిష్యత్ తరాలకు సహజ వనరులను కాపాడినట్లవుతుందని పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం చెరువుల పరిరక్షణ అంశంపై తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో హైడ్రా ఏసీపీ శ్రీకాంత్ రెడ్డి, డీఈ అన్నాజీ రావు, ఇన్‌స్పెక్టర్ సైదులు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్, ప్రియాంక అరెస్టులకు నిరసన

### మిర్యాలగూడలో కాంగ్రెస్ ఆందోళనలు.. మోదీ దిష్టిబొమ్మ దహనం



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూలై 23: ఏఐసీసీ అగ్రనేతలు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ అరెస్టులను నిరసిస్తూ నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులు బుధవారం పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించాయి.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి, మాడ్గులపల్లి మండలాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) నేతృత్వంలో నిర్వహించిన ఆందోళనలో కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ..ప్రశ్నించే గొంతులను అణచివేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా మారిందని విమర్శించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల ప్రజాదరణను చూసి రాజకీయ కక్షతోనే అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు.రాహుల్, ప్రియాంక గాంధీల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామని, వారిపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలను ప్రజలే తిప్పికొడతారని హెచ్చరించారు.నిరసన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు, విద్యార్థులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల పక్షాన బీఆర్ఎస్వీ పోరాటానికి సిద్ధం

### కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్వీ నాయకులు యాదగిరి భాస్కర్ నేత



గండిపేట(క్రైమ్ మిర్రర్): ఢిల్లీలో ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న అక్రమ అరెస్టులు, దౌర్జన్యాలు, అణిచివేత చర్యలకు వ్యతిరేకంగా భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం పోరాటానికి దిగుతుందని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్వీ నాయకులు యాదగిరి భాస్కర్ నేత ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ విధానాలను నివసిస్తూ శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇందిరాపార్కు ధర్నా వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల హక్కుల పోరాటానికి మద్దతుగా, బీఆర్ఎస్వీ చేపడుతున్న ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలిపేందుకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారన్నారు. విద్యార్థుల గొంతు క్కాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ ధోరణి సిగ్గుచేటు అన్నారు. విద్యార్థి లోకానికి అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కాటేదాన్ డివిజన్‌లోని బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, యువకులు, విద్యార్థులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
10 శుక్రవారం 24-7-2026

# పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్
# ఒకేసారి విడుదల చేయాలి

**విద్యారంగ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి**

**సంక్షేమ హాస్టల్ లు అద్దె భవనం లో కాకుండా సొంత భవనం నిర్మించాలి**

**ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు ఎంఈఓ పోస్టులు భర్తీ చేయాలి**

**ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శి ఎం పవన్ చౌహాన్ వంశీ వర్ధన్ రెడ్డి**

**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విజయవంతమైన 'చలో కలెక్టరేట్**




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు రంగారెడ్డి జిల్లాలో 'చలో కలెక్టరేట్' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పవన్ చౌహాన్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. హలో విద్యార్థి.. చలో కలెక్టరేట్ అనే నినాదంతో విద్యార్థి హక్కుల సాధన కోసం నాయకులు, విద్యార్థులు కదలివచ్చి ప్రభుత్వ నిర్లక్ష్య తీరుకు వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పవన్ చౌహాన్, సామిడి వంశీ వర్ధన్ రెడ్డి లు మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను గాలికి వదిలేసిందని తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యంగా, గత కొద్ది కాలంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్ బకాయిలను విడతల వారీగా కాకుండా, మొత్తం నిధులను ఒకేసారి విడుదల చేయాలని స్పష్టం చేశారు. బకాయిలు రాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్ బకాయిలను ఒకేసారి విడుదల చేసి విద్యార్థులను ఆదుకోకపోతే, రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల పక్షాన రాజీలేని పోరాటం చేసిన ఈ చలో కలెక్టరేట్ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, పత్లావత్ ఆకాష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు భుక్యా వినోద్ నాయక్, జిల్లా నాయకురాలు పార్వతి, మండల నాయకులు జూనొతల భాను ప్రకాష్, ఆందోజు నిఖిల్, వెంకట్ దుర్గా ప్రసాద్, చందు, క్రిష్, అరవింద్, మధు, హర్షిత్, గణేష్, తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## బాలగంగాధర్ తిలక్ 170వ జయంతి సందర్బంగా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యాలయ ప్రారంభం

గండిపేట(క్రైమ్ మిర్రర్): స్వాతంత్ర్య సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ 170వ జయంతి సందర్భంగా భాగ్యనగర్ గణేష్ చౌరస్తాలో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గత 47 సంవత్సరాలుగా భాగ్యనగర్ గణేష్ చౌరస్తా సమితి సామూహిక గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తోందన్నారు. స్వర్గీయ బాలగంగాధర్ తిలక్ ప్రారంభించిన సామూహిక గణేష్ ఉత్సవాల స్ఫూర్తితో ప్రతి ఏడాది జూలై 23న కార్యాలయాన్ని ప్రారంభించి, వినాయక చవితి నుంచి అనంత చతుర్దశి వరకు వివిధ ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమానికి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాఘవ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశిధర్, రాజేంద్రనగర్ అసెంబ్లీ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ వై. శ్రీధర్తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సామాజిక సామరస్యానికి ప్రతీకగా విజయవంతంగా నిర్వహించాలని నాయకులు పిలుపునిచ్చారు.

## బోనాల పండుగ ఏర్పాట్లపై కమిషనర్ను కలిసిన బండ్లగూడ జాగీర్ కాంగ్రెస్ నాయకులు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బండ్లగూడ జాగీర్ 121, 122, 123 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు గురువారం కమిషనర్ సురేందర్ రెడ్డిను మర్యాదపూర్వకంగా కలిసి ఆషాఢ మాస బోనాల పండుగ ఏర్పాట్లపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి డివిజన్లో జరిగే బోనాల ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని పోచమ్మ తల్లి ఆలయాల వద్ద ప్రత్యేక అలంకరణలు చేపట్టడంతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత వంటి అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. వినతిపై కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ బోనాల పండుగను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీర్ హైదర్ షాకోట్ డివిజన్ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు దప్పు నవీన్ కుమార్, బీసీ సెల్ అధ్యక్షులు అంకం శ్రీనివాస్ నేతతో పాటు డివిజన్ల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

## పార్టీలో కష్టపడి పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలి

**తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ అధ్యక్షులు బొర్రా జ్ఞానేశ్వర్ముదిరాజ్**

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ పార్టీలో ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ అధ్యక్షులు బొర్రా జ్ఞానేశ్వర్ముదిరాజ్ అన్నారు. హైదర్షాకోట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన పూలపల్లి కష్ణారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించారు. పార్టీ బలోపేతం కోసం సమిష్టిగా కషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్కుమార్, ఏ--బ్లాక్ అధ్యక్షులు దపున్ప నవీన్, కాంగ్రెస్ నాయకులు భోగాల శ్రీనివాస్, అంకం శ్రీనివాస్ నేత, లక్ష్మణ్, శ్రీనివాస్ముదిరాజ్, సుధాకర్, విష్ణు, మాదరపల్లి వినయ్, శివ తదితరులుపాల్గొన్నారు.



## ఓటరు జాబితా సవరణపై ప్రజలకు అవగాహన కల్పించిన బీఆర్ఎస్ నాయకులు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా మణికొండ, నెక్నంపూర్ డివిజన్లలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నాయకులు స్థానిక ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివపురి కాలనీ అధ్యక్షుడు మధు, సావిత్రి, హన్మంతు సాగర్, శ్రీనివాస్, తిరుపతి తదితర స్థానికులు బీఆర్ఎస్ నాయకుల కృషిని అభినందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు అందె లక్ష్మణ్ రావు మాట్లాడుతూ ఇప్పటికే ఓటర్ కార్డు ఉన్నవారు కూడా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారమ్ను తప్పనిసరిగా పూరించి, తమ ఓటును 2002 ఓటరు జాబితాలోని తమ లేదా కుటుంబ పెద్దల ఓటుతో మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందని వివరించారు. ఈ ప్రక్రియను పూర్తి చేయకపోతే భవిష్యత్తులో ఓటు హక్కుపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫారమ్లు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓటర్లకు సంబంధిత బూత్ లెవల్ అధికారుల మొబైల్ నంబర్లను అందించి, ఫారమ్లు పొందడం, ఆధార్ వివరాలు నమోదు చేయడం, 2002 ఓటరు జాబితాలోని నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం, ఓటరు సీరియల్ నంబర్ వంటి వివరాలను సేకరించి ఫారమ్లు సక్రమంగా పూరించేందుకు బీఆర్ఎస్ నాయకులు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, సుమనళిని, దేవి ప్రియ, షేక్ ఆరిఫ్, భాను చందర్, శ్రీధర్, బిందు, శివ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొని స్థానిక ఓటర్లకు సంపూర్ణ సహకారం అందించారు.




## మియాపూర్ సీఐగా జయరాం బాధ్యతలు..

**బీఆర్ఎస్ నేతల శుభాకాంక్షలు....**

మియాపూర్ క్రైమ్ మిర్రర్ :మియాపూర్ పోలీస్ స్టేషన్కు నూతనంగా సర్కిల్ ఇన్స్పెక్టర్గా బాధ్యతలు స్వీకరించిన జయరాం ను బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తౌట్ రెడ్డి సంతోష్ రెడ్డి, అడ్వకేట్ అరవింద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మియాపూర్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించాలని ఆకాంక్షించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ట్రాఫిక్ సమస్యలు, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు. నూతన సీఐ జయరాం తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు చేరువగా ఉండాలని అభినందించారు. పోలీసు శాఖకు తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వామ్యం అవుతామని హామీ ఇచ్చారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోక

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాటేదాన్లోని సీఐటీయూ కార్యాలయం నుంచి స్వప్న థియేటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం రాస్తారోక చేపట్టారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జాజాల రుద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగిన




ఈ కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి ఎం. చంద్రమోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ఉద్యోగ నియామక పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని, పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ నిరసనలో కార్మికులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు స్వప్న, కవిత, బి. వెంకటయ్య, చుక్క మోహన్, బచ్చలకూర స్వామి, ఎన్. జంగయ్య, సాయి, దీపక్, ప్రవీణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## వీధి నిర్వహణలో ఉన్న విలేఖరులపై దాడులు సిగ్గు చేటు

**మీడియా దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**టియుడబ్ల్యూజే నాయకుల డిమాండ్**





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆందోళనలు, ప్రజా ఉద్యమాలు, నిరసనలు ప్రజాస్వామ్య హక్కులేనని, అయితే విధి నిర్వహణలో ఉన్న పత్రిక, మీడియా ప్రతినిధులపై దాడులు చేయడం సరైంది కాదని టియూడ బ్లూజే (హెచ్ 143) రంగారెడ్డి జిల్లా అధ్యక్షా కార్యదర్శులు ఉపరి శేఖర్ సాగర్, గాదం రమేష్, కోశాధికారి పి. వెంకటేష్ లు అన్నారు. బుధవారం హైదరాబాద్లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులను చిత్రీకరించేందుకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై కొందరు రాళ్లతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా నిలుస్తూ, అన్ని రాజకీయ పార్టీల కార్యకలాపాలను నిష్పాక్షపాతంగా ప్రజలకు చేరవేస్తున్న జర్నలిస్టులపై తరచూ దాడులు జరగడం ఆందోళనకరమన్నారు. (

పజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా, పత్రిక విలేకరులపై దాడులు జరుగడం విచారకరమన్నారు. విలేకరులపై దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## విద్యార్థులపై లాఠీచార్జీ ప్రజాస్వామ్యానికి విరుద్ధం

**తప్పుడు కేసులు ఎత్తివేయాలి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: ఐలు డిమాండ్**

మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, జూలై 23: ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతూ పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్తున్న నిరాయుధ విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జీ చేయడం, అక్రమ నిర్బంధాలకు పాల్పడడాన్ని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఐలు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం మిర్యాలగూడలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని 19, 21 అధికరణలు కల్పించిన భావప్రకటన స్వేచ్ఛ, శాంతియుత సమావేశాల హక్కు, నిరసన తెలిపే హక్కులను ప్రభుత్వం, పోలీసులు గౌరవించాలని ఆయన డిమాండ్ చేశారు. శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని, పోలీసుల వైఖరి ప్రజాస్వామ్య హక్కులపై దాడిగా నిలుస్తోందని పేర్కొన్నారు. నిరసనకారులపై నమోదు చేసిన తప్పుడు క్రిమినల్ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అధిక బలప్రయోగానికి బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐలు కోరింది. రాజ్యాంగ పరిరక్షణ, పౌర హక్కుల రక్షణ, చట్ట పరిపాలనను కాపాడడం న్యాయవాదుల బాధ్యత అని వెంకట్రెడ్డి అన్నారు. విద్యార్థుల న్యాయమైన ఉద్యమానికి ఐలు పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు సంయమనం, పారదర్శకత, జవాబుదారీతనంతో వ్యవహరించి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు ఇబ్రహీం, కోర్టు కమిటీ అధ్యక్షుడు పరమేష్, కందిమల్ల వెంకట్రెడ్డి, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జె. ఎల్లయ్య, కొంక వెంకన్న, కళ్యాణ్, కరుణాకర్, ఉంగరాల నాగరాజు, సుమేర అస్మా, కొంక నిర్మల, గంగాభవాని, మైనం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.